వైఎస్ఆర్-అన్నమయ్య
తెలుగు జాతీయ దినపత్రిక
వార్త
గురువారం 20 జూలై 2023

## అర్హతగల వారందరికీ సంక్షేమ పథకాలు



**దువ్వూరు, జులై 19, ప్రభాతవార్త:**

గ్రామంలోని ఏ ఇంట్లో అయినా అర్హత గల ప్రతి ఒక్కరికి సంక్షేమ పథకాలు అందజేసే బాధ్యత ప్రభుత్వానిదే అని మైదుకూరు ఎమ్మెల్యే రఘురామిరెడ్డి అన్నారు. బుధవారం మండల పరిధిలోని చింతకుంట గ్రామ పంచాయతీలో అంబేద్కర్ నగర్, సి.బయనపల్లె గ్రామంల్లో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి ప్రతి ఇంటికి లబ్ధి చేకూర్చారని తెలిపారు. మహిళలకు వైఎస్ఆర్ ఆసరా, చేయూత వంటి పథకాలు అందజేశారని, చదువుకునే వారికి అమ్మఒడి, విద్యా దీవెన, వసతి దీవెన తదితర కార్యక్రమాలు ఉన్నాయన్నారు. చంద్రబాబు ప్రభుత్వ హయాంలో హామీలు ఇచ్చారే తప్ప ఒక్క హామీని కూడా నెరవేర్చలేదన్నారు. వైఎస్ జగన్ పాలనలో కుటుంబానికి లబ్ధి చేకూరి ఉంటే తిరిగి వైఎస్‌జగన్‌ను ఆశీర్వదించాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో జగదీశ్వర్‌రెడ్డి, తహసీల్దార్ రమాకుమాంరి, సర్పంచ్ వీరారెడ్డి, శంకర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## జనరల్ స్టోర్, బియ్యం వాపారాలపై లీగల్‌మెట్రాలజీ అధికారి ఆకస్మిక తనిఖీ

**పీలేరు, జూలై19 ప్రభాతవార :**



పట్టణంలోని జనరల్ స్టోర్సు, రైస్ దుకాణాలు, ఆయిల్ దుకాణాలు, సూపర్ మార్కెట్‌లను కడప అసిస్టెంట్ కంట్రోలర్, లీగల్ మెట్రాలజీ అధికారి కె.జె. రవీం ద్రారెడ్డి బుధవారం ఆకస్మికంగా తనిఖీలు నిర్వహించారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ నూనె దుకాణంలో నూనె ప్యాకెట్లు, సూపర్ మార్కెట్‌లలో వస్తువుల బరువు లును తనికీచేశారు. బియ్యపు బస్తాలులో నెట్‌వెయిట్ 25 కేజీలకు బదులు తక్కువగా ఉండటంతో 5కేసులు నమో దుచేసి రాజీ రుసుము ద్వారా రూ.1,05,000లు వసూలు చేశామన్నారు.

## నిత్యం తప్పని అనధికారిక విద్యుత్తు అంతరాయాలు..!

### - తిప్పలు ఎదుర్కొంటున్న వినియోగదారులు

### - రాత్రుళ్లు తప్పని జాగారం - మరో ప్రక్క దోమల బెడద

**(అన్నమయ్య ప్రతినిధి - ప్రభాతవార్త)**

అన్నమయ్య జిల్లా పరిధిలోని అనేక మండలాల్లో అనధికారిక విద్యుత్తు అంతరాయాలు అధికమవుతున్నాయి. అనధికారిక విద్యుత్తు అంతరాయాలపై విద్యుత్తు శాఖ అధికార వర్గాల నుండి సరైన సమాధానం రాని పరిస్థితి ఉంది. మరమత్తుల సమయంలో అంతరాయాలు ఏర్పడితే పరవాలేదు కాని మరమత్తులు లేని సమయాల్లో కూడా అంతరాయాలు వినియోగదారులు ఎదుర్కొంటున్నారు. నెలలో కనీసం ఒకటి రెండు రోజులైనా మరమత్తుల పేరుతో గంటల తరబడి విద్యుత్తు సరఫరాలో అంతరాయాలు షరామామూలు. ఇకపోతే అనధికారిక విద్యుత్తు అంతరాయాలపై సరైన రీతిలో స్పందించే అధికారులు దాదాపుగా విద్యుత్తు శాఖలో కరవైనట్లు ఫిర్యాదులు వినిపిస్తున్నాయి. అనేక సందర్భాల్లో విద్యుత్తు శాఖలో కనీసం ఫోన్ లిఫ్ట్ చేసే పరిస్థితులు కూడా లేవన్న ఆరోపణలు వినియోగదారులు వ్యక్తం చేస్తున్నారు. నిత్యం అనధికారిక విద్యుత్తు అంతరాయాలతో విద్యుత్తు వినియోగదారులకు తిప్పలు తప్పడం లేదు. రాత్రి పూట విద్యుత్తు అంతరాయాలు ఏర్పడినప్పుడు ముఖ్యంగా పేదవర్గాలకు జాగారం తప్పడం లేదు. మరోప్రక్క దోమల బెడద ఎక్కువైంది. విద్యుత్తు అంతరాయం ఏర్పడినప్పుడు దోమల కారణంగా ఎదురవుతున్న ఇబ్బందులతో అన్ని వర్గాల ప్రజలు ఆందోళనకు గురవుతున్నారు. ఆర్థికంగా బలంగా ఉన్నవారు ఇన్‌వర్టర్స్ ఏర్పాటు చేసుకోవడం వల్ల ఈ వర్గాలు మాత్రం అనధికారిక విద్యుత్తు అంతరాయాల నుండి తప్పించుకుంటున్నారు. పేదవర్గాలు మాత్రమే విద్యుత్తు అనధికారక అంతరాయాలకు తీవ్రంగా ఇబ్బందులకు గురవుతున్నారు. ఎప్పుడు కరంట్ ఉంటుందో ఎప్పుడు పోతుందో తెలియని పరిస్థితుల్లో వినియోగదారులు ఎదుర్కొంటున్న కష్టాలు అంతా ఇంతా కావు. గతంలో ఎన్నడూ లేని విధంగా నిత్యం విద్యుత్తు కష్టాలు ఎదుర్కొనే పరిస్థితి తప్పడం లేదని వాపోతున్నారు. ఒకోమారు గంటల తరబడి కూడా కరంట్ సరఫరా లేని పరిస్థితులుంటున్నాయి. వేసవి సమయంలో ఉక్కపోతతో ఎదుర్కొన్న ఇబ్బందులతో పోల్చుకుంటే ప్రస్తుతం రుతుపవనాల రాకతో అడపా తడపా పడుతున్న వర్షాలతో వర్షపు నీటి కుంటలు అధికమై దోమలు అధికమయ్యాయని, కరంట్ సరఫరా లేకుంటే ఉక్కపోత కొంతమేర తగ్గినా దోమలతో మరిన్ని సమస్యలు ఎదుర్కొనాల్సి వస్తుందంటున్నారు. కనీసం విద్యుత్తు కొతల సమయంలో కోత సమయం



తెలుస్తుంది కాబట్టి వినియోగదారులు ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేసుకుంటూ తమ తిప్పలు ఏదో విధంగా పడేవారు. ప్రస్తుతం ఎప్పుడు కరంట్ ఉంటుందో ఎప్పుడు పోతుందో తెలియని స్థితిలో అన్ని వర్గాల ప్రజలు అవస్థలు పడాల్సి వస్తుంది. ఓ మోస్తరు గాలి వీచినా, తేలికపాటి వర్షాలు పడ్డా కరంట్ సరఫరా నిలిపివేయడం పరిపాటిగా మారింది. వేసవి అయిపోయినా ఉక్కపోత ఉంటుండంతో తప్పనిసరిగా అన్ని వర్గాల ప్రజలు ఫ్యాన్స్ వాడుతున్నారు. దీంతో కరంట్ లేకుంటే నిద్ర కూడా పట్టని పరిస్ ్థతిని అన్ని వర్గాల పేద, సామాన్య, మధ్యతరగతి ప్రజలు ఎదుర్కొంటున్నారు. వర్షపు కుంటల కారణంగా దోమల బెదడ ఎక్కువవుతున్నా పంచాయితీలు కాని, మున్సిపాలిటీలు కాని వీటి నివారణ చర్యలు చేపట్టడంలో విఫలమవుతున్నారు. దోమల నివారణకు తూతూ మంత్రంగా స్పందిస్తున్నారు. ఇందుకు కారణాలు కూడా లేకపోలేదు. అన్ని పంచాయితీల వద్ద దోమల నివారణకు, పారిశుద్ధ్యం మెరుగు పరిచేందుకు అవసరమైన నిధుల సమస్య వెంటాడుతుండడం ప్రధాన కారణంగా కనిపిస్తుంది. ఇప్పటికైనా విద్యుత్తు శాఖ అనధికారిక కరంటు అంతరాయాలు లేకుండా చర్యలు తీసుకోవాల్సి ఉంది. అలాగే దోమల నివారణకు అన్ని పంచాయితీలు, మున్సిపాలిటీలు సరైన చర్యలు తీసుకునే విధంగా అవసరమైన మౌళిక ఆదేశాలతో పాటు నిధుల సమస్యను కూడా పరిష్కరించేందుకు స్థానిక ప్రజాప్రతినిధులు తగు విధంగా ప్రభుత్వంపై ఒత్తిడి తీసుకురావాల్సి ఉంది.

## హత్య, ప్రతీకార హత్య కేసుల్లో మొత్తం 14 మంది ముద్దాయిలకు యావజ్జీవ కారాగార శిక్ష

### - ఒక్కొక్కరికి రూ.1.20లక్షలు జరిమానా

### - శిక్షపడేలా కృషి చేసిన పోలీసు అధికారులను అభినందించిన ఎస్పీ

**ప్రొద్దుటూరు క్రైం, జులై 19, ప్రభాతవార్త:**



తాళ్ల ప్రొద్దుటూరు పోలీసు స్టేషన్ పరిధిలోని టి.కోడూరు గ్రామంలో 2012 మే 9న జరిగిన హత్య కేసులో అలాగే 2013 డిసెంబరు 22న జరిగిన ప్రతీకార హత్య కేసులో ముద్దాయిలైన మొత్తం 14 మందికి యావజ్జీవ కారాగార శిక్ష, ఒక్కొకక్కరికి రూ.1.20లక్షలు జరిమానా విధిస్తూ ప్రొద్దుటూరు 2వ ఏడీజే కోర్టు జడ్జీ జి.ఎస్.రమేష్ బుధవారం తీర్పు ఇచ్చారు. 2012లో తాళ్ల ప్రొద్దుటూరు పోలీసు స్టేషన్ పరిధిలోని టి.కోడూరు గ్రామంలో పిక్కిలి చిన్న వెంకటేష్(56), ఇతని అన్న పెద్ద వెంకటేష్‌కు సంబంధించిన ఏడుగురు ముద్దాయిలు పిక్కిలి పెద్ద శ్రీరాములు, పిక్కిలి చంద్రశేఖర్, పిక్కిలి చిన్న శివరాముడు, పిక్కిలి లక్ష్మిప్రసాద్, పిక్కిలి వెంకట శ్రీనాథ్, బెస్త గురుమూర్తి, చిన్న వెంకట కొండప్పలు మే 9 దుయం ఘర్షణ పడి మాటా మాటా పెరగింది. మనసులో పెట్టుకున్న ముద్దాయిలు అదే రోజు రాత్రి పెద్ద వెంకటేష్ ఇంటి వద్దకు వచ్చి వేట కొడవళ్లు, కట్టెలు, రాళ్లతో దాడి చేసి పిక్కిలి మహా చంద్రయ్య(28)ని హత మార్చారు. హత్యపై హతుడి చిన్నాన్న పిక్కిలి చిన్న వెంకటేష్ తాళ్ల ప్రొద్దుటూరు పీఎస్‌లో కేసు నమోదు చేశారు. మరో ప్రతీకార హత్య కేసులో టి.కోడూరు గ్రామంలో అదే గ్రామానికి చెందిన పిక్కిలి నాగార్జున, పిక్కిలి రవి, పిక్కిలి చంద్ర, లక్ష్మయ్య, పిక్కిలి రామాంజనేయులు, రామ్‌మోహన్, పెద్ద వెంకటేష్‌లు గతంలో జరిగిన హత్య కేసులో మూడో ముద్దాయిగా ఉన్న చౌడరాముడు అలియాస్ బెస్త రాముడు(28)పై కత్తులు, ఈటెలు, కట్టెలతో దాడి చేసి హత మార్చారు. హత్యకు సంబంధించి హతుడి సమీప బంధువు సుబ్బరాయుడు ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు. ఈ రెండు కేసుల్లో క్షుణ్ణంగా దర్యాప్తు చేసి సరైన సమయంలో సాక్షులను కోర్టు ముందు హాజరు పరచడంలో కృషి చేసిన అప్పటి కొండాపురం సీఐలు శ్రీనివాసులు, మూర్తి, ఎస్సైలు మోహన్, రవికుమార్, కోర్టు కానిస్టేబుల్ నరసింహులుతో పాటు కేసులను ప్రాసిక్యూషన్ తరుపున వాదించిన పబ్లిక్ ప్రాసిక్యూటర్ రాంప్రసాద్‌రెడ్డిలను జిల్లా ఎస్పీ కేకేఎన్ అన్బురాజన్ ప్రత్యేకంగా అభినందించారు.

## సమస్యల పరిష్కారానికే జగనన్న సురక్ష

### ఎమ్మెల్యే రాచమల్లు శివప్రసాద్‌రెడ్డి

**ప్రొద్దుటూరు జులై 19, ప్రభాతవార్త**



రాష్ట్రంలో కొన్నేళ్లుగా పరిష్కారం కానీ సమస్యలను తక్షణం పరిష్కరించడమే జగనన్న సురక్ష కార్యక్రమ లక్ష్యం అని ఎమ్మెల్యే రాచమల్లు శివప్రసాద్ రెడ్డి పేర్కొన్నారు. బుధవారం స్థానిక 39 వ సచివాలయ పరిధిలో కౌన్సిలర్ మీగడ దీప్తి చంద్రశేఖర రెడ్డి ఆధ్వర్యంలో నిర్వహించిన జగనన్న సురక్ష కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గత చంద్ర బాబు ప్రభుత్వ పాలనలో ఒక రేషన్ కార్డు మంజూరు కావాలంటే నాలుగేళ్లు పట్టిందని అదే రేషన్ కార్డు జగన్ ప్రభుత్వంలో నాలుగు రోజులలో అందిస్తు న్నామని ఇదే జగన్ ప్రభుత్వానికి చంద్రబాబు పాలనకు వ్యత్యాసం అన్నారు. డ్వాక్రా రుణాలు మాఫీ చేస్తానని మోసం చేసిన చంద్రబాబు నైజం అయితే ఇచ్చిన హామీ మేరకు రుణమాఫీ చేయడం జగన్ లక్ష్యమన్నారు జగనన్న సురక్ష కార్యక్రమం ద్వారా ప్రభుత్వం నుండి లకు అవసరమైన ధ్రువీకరణ పత్రాలు తక్షణమే మంజూరు చేశామన్నారు విద్యా విధానంలో విప్లవాత్మకమైన మార్పు లు చేస్తూ పాఠశాలల రూపురేఖలే మార్చారన్నారు పిల్లలు చదువుకునేందుకు ప్రోత్సహిస్తూ అమ్మ ఒడి పేరుతో 15వేలు నగదు జమ చేశారన్నారు. జగనన్న విద్యా కానుక జగనన్న వసతి దీవెన లాంటి పథకాలతో విద్యకు పెద్దపీట వేశా రన్నారు. రాష్ట్రంలోని అన్ని వర్గాలకు ఆర్థిక సహాయం అందిస్తూ పేద కుటుం బాలకు ఆర్థిక భరోసా కల్పించిన ఘనత ముఖ్యమంత్రి వైయస్ జగన్మోహన్ రెడ్డికే దక్కుతుందని పేర్కొన్నారు. ప్రతి కుటుంబానికి మేలు చేసిన ముఖ్య మంత్రి జగన్మోహన్ రెడ్డిని తిరిగి గెలిపించాలని ఆయన విజ్ఞప్తి చేశారు. నిజంగా మీ కుటుంబానికి మేలు జరిగి ఉంటేనే వైసీపీని గెలిపించాలని ఆయన స్పష్టం చేశారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్ పర్సన్ భీమునిపల్లి లక్ష్మీదేవి నాగరాజు మున్సిపల్ కమిషనర్ సివి రమణయ్య కౌన్సిలర్ మీగడ దీప్తి వైసిపి నాయకులు మీగడ చంద్రశేఖర రెడ్డి సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.




## టీడీపీ గెలుపే ధ్యేయంగా పని చేయాలి

- టీడీపీ ప్రధాన కార్యదర్శి కిశోర్‌కుమార్‌రెడ్డి

III లో

## కలెక్టర్ చేతుల మీదుగా చేయూత మహిళా మార్ట్ ప్రారంభం

**బద్వేలు, జూలై 19 ప్రభాతవార్త :**



చేయూత మహిళా మార్ట్‌ను ప్రారంభిస్తున్న కలెక్టర్

పట్టణంలోని ఎన్జీవో కాలనీ నందు ఏర్పాటుచేసిన చేయూత మహిళా మార్ట్ ప్రారంభోత్సవాన్ని కలెక్టర్ విజయరామరాజు చేతుల మీదుగా ప్రారంభించారు. అనంతరం కలెక్టర్ విజయరామరాజు మాట్లాడుతూ స్వయం సహాయక సంఘాల గ్రూపుల ఆధ్వర్యంలో ఈ చేయూత మహిళా మార్ట్ ఏర్పాటుచేయడం జరుగుతుందన్నారు. బద్వేలు, గోపవరం మండలాలకు సంబంధించి వెయ్యి గ్రూపులు, 10 వేల మంది సభ్యులతో 30 లక్షల రూపాయలు వ్యయంతో ఈ మార్ట్ ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. ప్రస్తుతం మార్కెట్‌లో దళారి వ్యవస్థ పెరగడమే కాకుండా అధిక రేట్లకు అనుగుణంగా ఉండే విధంగా ప్రతి ఒక్కరికీ తక్కువ ధరలలో వస్తువులు అందుబాటులో ఉండే విధంగా ఈ మార్ట్ ఉంటుందన్నారు. జిల్లాలో ఖాజీపేటలో ఏర్పాటు చేయడం జరిగిందని, చేయూత మహిళా మార్ట్ అభివృద్ధిబాటలో నడుస్తున్న నేపథ్యంలో బద్వేలులో కూడా ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. ఈ అవకాశాన్ని ఈ ప్రాంత ప్రజలు సద్వి నియోగం చేసుకోవాలని కోరారు. అలాగే స్వయంగా మహి ళలే ఈ మార్ట్‌ను ఏర్పాటు చేసుకున్నారు కాబట్టి ఇంత పెట్టుబడి పెట్టినా ఇందులో ఉండే కష్టాన్ని వారు ఫలితంగా భావిస్తూ నడిపిస్తున్న నేపథ్యంలో ప్రజలకు ధరలను అందుబాటులో ఉండే విధంగా చేస్తున్నందున ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఈ కార్యక్రమం లో జాయింట్ కలెక్టర్ గణేష్ కుమార్, ట్రైనీ కలెక్టర్ రాహు ల్ మీనా, డిఆర్‌డిఏ పీడి ఆనంద్ నాయక్, ఆర్డీవో ఆకుల వెంకటరమణ, చేయూత డిపిఎం సుబ్బారెడ్డి, తహసీల్దారు మధుసూదన్ రెడ్డి, దామోదర్ రెడ్డి, కమీషనర్ కృష్ణారెడ్డి, ఎంపీడీవో నూర్‌జాన్ మరియు పలువురు అధికారులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## నిధులు దుర్వినియోగంపై ఎంఇఓ గిరివరదయ్య సస్పెండ్

**వీరబల్లి జులై 19, ప్రభాతవార్త**



వీరబల్లి మండలంలో విద్యా శాఖ అధికారిగా పనిచేస్తున్న గిరి వర దయ్యను సస్పెండ్ చేసినట్లు జిల్లా విద్యా శాఖ రీజినల్ జాయింట్ డైరెక్టర్ కార్యాలయం నుండి మండల కేంద్రానికి ఆదేశాలు పంపించారని తెలిసింది. ఈయన చేసిన మూడు కోట్ల అవినీతిపై ఉపాధ్యాయులు మధు సుధన్ రెడ్డి మరికొందరు ఉపాధ్యాయులు ఉన్నత అధికారులకు గతంలో ఫిర్యాదు చేయ డం జరిగింది. ఈ నేపథ్యంలో ఉప విద్యాశాఖ అధికారి వర లక్ష్మి విచారణ చేపట్టారు. ఈ విచారణలో అనేక అచర్యపరిచే విషయాలు బయటపడడం జరిగింది. పిర్యాదులో భాగంగా పాఠశాలలకు నిధులు దుర్వినియోగం చేసినట్లు రుజువు కావడం జరిగింది. ఉపాధ్యాయులకు సంబంధించిన సర్వీస్ రిజిస్టర్లలో ఎలాంటి నమోదు చేయలేదని తేలింది అయితే మెడికల్ లీవ్‌కి సంబంధించింది కానీ, ఈ యల్‌లు అంశాలను రికార్డులలో ఎటువంటి నమోదు చేయ లేదని తెలిసిందన్నారు. ఆశ్చర్యం కలిగించే విధంగా చాపల మార్కెట్ మాదిరి గా ఎస్ఆర్‌లో ఉన్నాయని తెలిపారు. డిప్యూటేషన్‌లో అర్హత ఉన్న ఉపాధ్యాయులను పంపకుండా అర్హత లేని ఉపాధ్యాయులను పంపించినట్లు రుజువైం దనీ తెలిపారు. రెడ్డివా రిపల్లి ఉన్నత పాఠశాల స్కావేంజర్ కంటెం జట్ ఛార్జీలు రూ.72000లు వేరే వారి పేరు మీద మార్చుకొని స్వాహా చేసినట్లు రుజువు కావడం జరిగింది. 2018-19 విద్యా సంవత్సరంలో పాఠశాలలకు మంజూరైన నిధులకు ఇటువంటి రికార్డులు కూడా లేదని ఖర్చు చేసినట్లు రుజువయిందని తెలిపారు. 2020 విద్యా సంవత్సరంలో ఉపాధ్యాయులకు సంబంధించిన సర్వీస్ రిజిస్టర్‌లలో అక్కడక్కడా పరిశీలించగా ఎలాంటి ఎంట్రీస్ లేదని రుజువు కావడం జరిగిందని తెలిపారు. పై విషయాలన్నిటి పైన ఉన్నతాధికారులు క్షుణ్ణంగా విచారించి రుజువు కావడంతో సస్పెండ్ చేసారు.




## ప్రజా సమస్యల పరిష్కారానికే జగనన్న సురక్ష

### ఎమ్మెల్యే రఘురామిరెడ్డి

**మైదుకూరు జులై 19, ప్రభాతవార్త**



ప్రజల సమస్యలు తెలుసుకుని వాటిని పరిష్కరించేందుకే ప్రభుత్వం జగనన్న సురక్ష కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు మైదుకూరు ఎమ్మెల్యే శెట్టి పల్లి రఘు రామిరెడ్డి అన్నారు. మండలలోని విశ్వనాధ పురం గ్రామంలో బుధవారం జగనన్న సురక్ష గ్రామసభ నిర్వహించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ జగన్ ప్రభుత్వంలో అన్ని పథకాలు ప్రజలకు పారదర్శకంగా అందుతున్నాయన్నారు. ఒకప్పుడు తెలుగుదేశం ప్రభుత్వంలో ఏ చిన్న పనికావాలన్న అంటే స్థలం కావాలన్న, ఇల్లు కావాలన్న, కులం, బర్త్ సర్టిఫికెట్ లు కావాలన్నా పని పోగట్టుకొని మండలానికెళ్ళే వాళ్ళమని ఇప్పుడు మేమే మీ ఇంటికొచ్చి ఇస్తున్నా మన్నారు. గత ప్రభుత్వం చిన్న పనికావాలన్నా జన్మభూమి కమిటీ వాళ్ళు చెపితేనే కొందరికి పనిచేసేవారని ఇప్పుడు మేము కులం, మతం పార్టీలతో సంబంధం లేకుండా అందరికి మీ ఇంటికే వచ్చి ఇస్తున్నామన్నారు. విశ్వనాధ పురం పంచాయతీ పరిధిలో 11రకాల సర్టిఫికెట్ లను వేయి మంది కి ఇక్కడే ఇస్తున్నామన్నారు. రోడ్లు లేనిచోట రోడ్లు వేస్తున్నామని, ఏ సమస్య ఉన్నా ఇక్కడే సచివాలయం పరిధిలో పరిష్కరిస్తామని అన్నారు. అనంతరం లబ్ది దారులందరికి ధ్రువీకరణ పత్రాలు అందచేశారు. కార్యక్రమంలో మార్కెట్ యార్డ్ చైర్మన్ అన్నపురెడ్డి శ్రీమన్నారాయణ రెడ్డి, మండల వైస్ చైర్మన్ ఊటు కూరు రఘురామిరెడ్డి, సింగల్ విండో చైర్మన్ మూలె సుధాకర్ రెడ్డి, జడ్పీటీసీ అట్లూరు సుబ్బారెడ్డి, నాగేంద్ర ప్రసాద్,సర్పంచ్, ఎమ్మార్వో అనురాధ. ఎంపీడీవో రమణారెడ్డి, సచివాలయ సిబ్బంది గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

## దగ్ధమైన ఇల్లు - 3 లక్షలు ఆస్తి నష్టం

**చిట్వేలి, జులై 19**

**ప్రభాతవార్త**



మంటల్లో కాలిపోయిన సామగ్రి

అర్ధరాత్రి ఇల్లు దగ్ధమైన సంఘటన మంగళవారం రాత్రి చిట్వేలి మండల పరిధిలోని ఎం.గొల్లపల్లె గ్రామం అరుంధతివాడలో చోటు చేసుకుంది. బాధితురాలు కొత్త వరాలమ్మ తెలిపిన వివరాల ప్రకారం తాను ఇంటిలో లేని సమయంలో తమపైన కక్ష సాధింపులో భాగంగా ఓ వ్యక్తి కావాలనే ఈ దురాగతానికి పూనుకున్నారని ఆరోపించారు. మూడు లక్షల మేర ఆస్తినష్టం వాటిల్లిందని, సర్వం కోల్పోయి కట్టుబట్టలతో మిగిలానని మాకు న్యాయం చేయాలని ఆమె అన్నారు. కక్ష దారుణపై కేసు నమోదు చేశామని, కాగా దానికి ఆధారాలు చూపాలని పోలీసు వారు అనడం బాధ కలిగిస్తుందని వరాలమ్మ అన్నారు. గ్రామ రెవెన్యూ పోలీసు వారు పరిశీలించారని మాకు సరైన న్యాయం చేయాలని ఆమె వాపోయారు.

## నకిలీ పత్రాలు సృష్టించి పొలం స్వాధీనం

అట్లూరు, జులై 19 ప్రభాతవార్త :



న్యాయం చేయాలని కోరుతున్న బాధిత మహిళ తొగరకుంట రహిముస్సీ స

మండలంలోని తంబళ్ళగొంది పంచాయతీ నబియాబాద్ గ్రామానికి చెందిన తొగరకుంట ఖాజా రసూల్ భార్య రహిమున్నీసా అనే మహిళకు తంబళ్ళగొంది రెవిన్యూ గ్రామ పొలంలో కడప-బద్వేలు ప్రధాన రహదారికి అనుకొని సర్వే నెంబర్ 341బి లో సుమారు 40 సంవత్సరాల క్రితం నుండి మా మామ ఖాదర్‌వలి ఆ స్థలములో రెండు గృహాలు, ఎద్దుల వసార, పశువుల పాక నిర్మించుకొని జీవిస్తుండేవారని, కానీ 2019 లో తొగరకుంట సుకూర్ బాష అనే వ్యక్తి మేము గ్రామంలో లేని సమయంలో ఎద్దుల కొట్టము, పశువుల పాక, ఇంటి వసార, ప్రహరీ గోడలను దౌర్జన్యంగా తొలగించాడని వాపోయారు. 2009లో మా ఇంటికి మా ఇంటి ముందర ఉన్న స్థలానికి కంచె కూడా నిర్మించుకొని ఉన్నామని, సుకూర్ బాషాను నీకు ఏమి హక్కు, మా ఆస్తిని దౌర్జన్యంగా ఆక్రమించుకోవాలని చూస్తున్నావని ప్రశ్నిస్తే 2009 సంవత్సరంలో అట్లూరు మండల తహసీల్దారు మీరు ఉన్నర ఇంటిని, పశువుల వసార, ఎద్దుల వసార మొత్తం ఆ స్థలానికి నాకు డికేటి పట్టా ఇచ్చారని సమాధానం ఇచ్చాడని, ఆ పట్టా గురించి సమాచార హక్కు చట్టం ద్వారా అప్పటి తహసీల్దారును వివరాలు కోరగా 22 ఏప్రిల్ 2009లో సుకూర్ బాష పేరు మీద డికేటి పట్టా ఇచ్చినట్లు తహసీల్దారు జారీ చేసి ఉన్నారని, కానీ ఆ రికార్డులను పరిశీలించగా అందులో రెండు సీల్లు ఉండగా ఒకటి కడప జిల్లా, మరొకటి వైఎస్సార్ జిల్లాగా పేరు ఉందని, అదే గ్రామానికి చెందిన ఓ వ్యక్తి నకిలీ పట్టాలు సృష్టికర్తతో కలిసి దోస్తీ కుదిరిందని, కానీ 2009లో కడప జిల్లాను వైఎస్ఆర్ జిల్లాగా పేరు మార్చబడలేదని, అక్కడ వీరి డొల్లతనం బయటపడిందన్నారు. జూలై 4, 2020న సుకూర్ బాష తప్పుడు రికార్డులను జిల్లా కలెక్టర్, రాజంపేట ఆర్డీవో దృష్టికి తీసుకొనిపోయి తగు చర్యలు తీసుకోవాలని ఫిర్యాదు చేశామని, ఉన్నతాధికారులు స్పందించి తనకు న్యాయం చేయాలని బాధిత మహిళ కోరారు.

## ప్రజల సౌకర్యం కోసమే సచివాలయం ఏర్పాటు : ఎమ్మెల్యే





పెండ్లిమర్రి, జులై 19, ప్రభాతవార్త:

గ్రామ ప్రజల సౌకర్యం కోసమే సచివాలయ ఏర్పాటు చేయడం జరిగిందని కమలాపురం ఎమ్మెల్యే పి.రవీంద్రనాథ్‌రెడ్డి పేర్కొన్నారు. మండల కేంద్రమైన పెండ్లిమర్రిలో బుధవారం ఉదయం నూతన సచివాలయాన్ని ప్రారంభోత్సవం చేశారు. అనంతరం జగనన్న సురక్ష కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో కమలాపురం శాసనసభ్యులు రవీంద్రనాథ్‌రెడ్డి మాట్లాడుతూ దాదాపు 17 నవరత్నాల స్కీముల కింద రూ.19,68,59,981 మంజూరైనట్లు నాన్ టీబీటీ కింద వైఎస్ఆర్ ఆరోగ్యశ్రీ జగనన్న తోడు, జగనన్న గోరుముద్ద, వైఎస్ఆర్ కంటి వెలుగు, వైఎస్ఆర్ సంపూర్ణ పోషణ కింద ప్రజలకు లబ్ధి చేకూరి నట్లు ఆర్టీసీ ఛైర్మన్ మల్లికార్జున్‌రెడ్డి మాట్లాడుతూ గాంధీజీ కలలు కన్న గ్రామ స్వరాజ్యం జగనన్నతోనే సాధ్యమని తెలిపారు. కార్యక్రమంలో గ్రామసర్పంచ్ బి.నాగమల్లారెడ్డి, ఆర్.లక్ష్మమ్మ, ఎంపీటీసీ కృష్ణయ్య, తహసీల్దార్ ఉదయ్ భాస్కర్‌రాజు, ఎంపీడీవో జగన్‌మోహన్‌రెడ్డి, ఎమ్మెస్ఓ ప్రభాకర్‌రెడ్డి, జిల్లా పరిషత్ వైస్ ఛైర్మన్ బాలయ్య, మండల అధికారులు, పంచాయతీ కార్యదర్శి సుధాకర్, సచివాలయ సిబ్బంది, గ్రామవాలంటీర్లు, గ్రామ ప్రజలు, వైసీపీ నాయకులు పాల్గొన్నారు.

## రైల్వేస్టేషన్ రోడ్డులో వీధి లైట్లు ఏర్పాటు చేయాలి : డీవైఎఫ్ఐ

జమ్మలమడుగు, జులై 19, ప్రభాతవార్త:



పట్టణంలో రైల్వే స్టేషన్ రోడ్డు దారిలో ప్రభుత్వ అధికారులు వీధి దీపాలు ఏర్పాటు చేయాలని డీవైఎఫ్ఐ యువజన సంఘం జిల్లా కార్యదర్శి వీరణాల శివ కుమార్ కోరారు. బుధవారం మున్సిపల్ కార్యాలయంలో కమిషనర్ వెంకట రామిరెడ్డికి వినతిపత్రం అందజేసి విన్నవించారు. ఈ మార్గంలో అధిక సంఖ్యలో ప్రజలు సంచరిస్తున్నారని రాత్రివేళల్లో వీధి దీపాలు లేక ఇబ్బందులు పడుతున్నా రని అనేక ప్రమాదాలు జరిగాయన్నారు. తక్షణమే వీధి దీపాలు ఏర్పాటు చేయాలని కోరారు. కార్యక్రమంలో డీవైఎఫ్ఐ పట్టణ నాయ కులు శివ, ఉదయ్, సాంబశివ, వెంకటేష్ పాల్గొన్నారు.

## ఎలక్ట్రిక్ చెత్త సేకరణ ఆటోలు మంజూరు

– ప్రారంభించిన ఎమ్మెల్యే డా.మూలె సుధీర్‌రెడ్డి

జమ్మలమడుగు, జులై 19, ప్రభాతవార్త:



స్వచ్ఛ సంకల్పం క్లీన్ ఆంధ్రప్రదేశ్ కార్యక్రమంలో భాగంగా జమ్మలమడుగు మున్సిపాలిటీలో ఇది వరకు ఉన్న 5 మున్సిపల్ ఎలక్ట్రిక్ ఆటోలు చెత్త సేకరణకు సరిపోక అదనంగా మరో ఆరు నూతన ఎలక్ట్రిక్ ఆటోలను ఎమ్మెల్యే డా.సుధీర్ రెడ్డి ప్రత్యేక చొరవతో మంజూరు చేయించి వాటిని బుధవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ప్రజలు సంతోషం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో అధికారులు, వైకాపా నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## రక్తదానం చేయండి ... ప్రాణదాతలు కండి

ఎస్ఎఫ్ఐ పట్టణ కార్యదర్శి సురేష్

ప్రొద్దుటూరు అర్బన్, జులై 19, ప్రభాతవార్త



పొద్దుటూరు పట్టణంలో ఉన్న లైఫ్ హాస్పిటల్‌లో తిరుపాల్ అనే అనీ మియా (రక్తహీనత) తో బాధ పడుతుంటే ఆ విషయాన్ని ఎస్ఎఫ్ఐ పట్టణ కార్యదర్శి సురేష్‌కు తెలపగా వెంటనే తిరుపాల్‌కు రక్తం ఇప్పించడం జరిగింది. తిరుపాల్ కుటుంబ సభ్యులు ఎస్ఎఫ్ఐ పట్టణ కమిటీ కార్యదర్శి సురేష్ కు ధన్యవాదాలు తెలిపారు. ప్రొద్దుటూరు పట్టణంలో ఎవరికైనా రక్తం అవసరం అయితే ఉచితముగా ఇస్తామని అన్నారు. రక్తం అవసరమైన వారు ఎస్ఎఫ్ఐ, డివైఎఫ్ఐ కమిటీలను 7671073221, 9502494474 సంప్రదించవచ్చున్నారు.

## రాయితీ ధరలపై బియ్యం, కందిపప్పు పంపిణీ

ఆర్డీఓ ఎంఎస్.మురళి

మదనపల్లె, జులై 19 ప్రభాతవార్త :



రాయితీ విధానంలో పట్టణ ప్రజలకు బియ్యం, కందిపప్పు పంపిణీ చేయ నున్నట్లు మదనపల్లె ఆర్డీఓ ఎంఎస్. మురళి తెలిపారు. బుధవారం రైతు బజారు కేంద్రంలో రాయితీ ధరలపై బియ్యం, కందిపప్పు విక్రయానికి ఆర్డీఓ, మార్కెట్‌యార్డు ఛైర్‌పర్సన్ తట్టిశారదమ్ములు ప్రత్యేక కేంద్రాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రజలకు తక్కువ ధరలకు పంపిణీ చేసేందుకు బిపిటి రైస్ రాయితీపై కిలో రూ.48లకు, స్టిమ్‌రైస్ రూ.46లకు, కందిపప్పు కిలో రూ.138లకు రాయితీ విధానంలో విక్రయించ నున్నట్లు తెలిపారు. పట్టణ ప్రజలు ఈ రాయితీ విధానంలో విక్రయించే బియ్యం, కంది పప్పును కొనుగోలు చేసుకోవాలన్నారు. పట్టణ రైస్ మిల్లర్స్, పప్పుల వ్యాపా రస్తుల అసోసియేషన్ వారి ఆధ్వర్యంలో వీటిని విక్రయిస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో మార్కెట్‌యార్డు డైరెక్టర్ తట్టి శ్రీనివాసులురెడ్డి, ఏడిఎం త్యాగరాజు, కౌన్సిలర్ మోబీనా, సెక్రటరీ అభిలాష్, వైసిపి నాయకులు సలీం, చంద్రమౌళి, మాకం అశోక్‌కుమార్, డిప్యూటితహశీల్దార్ రెడ్డప్ప, పాల్గొన్నారు.

## గ్రంథాలయాల అభివృద్ధికి ఛైర్మెన్ కృషి అమోఘం

మదనపల్లె, జులై 19 ప్రభాతవార్త :




గ్రంథాలయాల అభివృద్ధికి ఛైర్మెన్ మధుబాల కృషి అమోగమంటూ గ్రంథాలయ అధికారులు ఆర్.వసంతకుమారి, చంద్ర శేఖర్‌నాయక్, తులసీ నాయక్, రమా పతి, రెడ్డిరాణి తెలిపారు. బుధవారం ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో వారు మాట్లాడుతూ ఉమ్మడి చిత్తూరుజిల్లాలో 71 గ్రంథాలయాలు ఉన్నాయని వాటి అభివృద్ధికి ఛైర్మెన్ ప్రత్యేక చొరవ చూపారన్నారు. ఈ ఏడాది 49గ్రంథాలయాల్లో వేసవి శిక్షణా శిబిరాలు విజయవంతంగా నిర్వహించా రన్నారు. గ్రంథాలయాల్లో అనేక రకాల పుస్తకాలను అందుబాటులోకి తెచ్చి పాఠకులు, విద్యార్థులలో మానసిక వికాసం, మేథోసంపత్తి పెరుగుదలకు దోహద పడుతున్నాయన్నారు. ఛైర్మెన్‌గా బాధ్యతలు చేపట్టిననాటి నుంచి గ్రంథాలయాలు మరిన్ని పుస్తకాల్లో అందుబాటులోకి వచ్చాయన్నారు. సిబ్బంది కొరత భర్తీకి కూడా ప్రతిపాదనలు పంపారన్నారు. గ్రంథాలయాల్లో మౌళిక వసతులు కల్పనకు చర్యలు చేపట్టడం హర్షనీయమన్నారు.

## విద్యార్థుల భవిష్యత్తు బాధ్యత ఉపాధ్యాయులదే

జిల్లా వికలాంగుల సంక్షేమశాఖ అధికారి క్రిష్ణకిషోర్

మదనపల్లె, జులై 19 ప్రభాతవార్త :



విద్యార్థుల బంగారు భవిష్యత్తు తల్లిదండ్రులే కాకుండా ఉపాధ్యాయుల చేతు ల్లో ఉంటుందని జిల్లా వికలాంగులు, వయోవృద్ధుల సంక్షేమ శాఖ అధికారి క్రిష్ణకిషోర్ తెలిపారు. బుధవారం అమ్మచెరువుమిట్ట సమీపంలోని వెలుగు ప్రత్యేక పాఠశాలలో దివ్యాంగుల కొరకు కేంద్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు యూడిఐడి కార్డు, నిర్మయ స్కీమ్‌యొక్క ఉపయోగాలు గురించి తెలియజేయడానికి తల్లిదండ్రుల సమావేశం ఏర్పాటు చేశారు. ఈసమావేశానికి ముఖ్య అతిధిగా హాజరైన జిల్లా అధికారి మాట్లాడుతూ తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు ఇరువురు కలసి విద్యార్థి భవిష్యత్తుకు తోడ్పడాలన్నారు. యూడిఐడికార్డు, నిర్మయ స్కీమ్ ప్రాముఖ్యతను, ఉపయోగాలు వాటికి సంబంధించినటువంటి సర్టిఫికెట్లును సంబంధిత అధికారులను సంప్రదించాలన్నారు. వెలుగు కన్వీనర్ ఆర్.బాగ్య లక్ష్మి, ప్రిన్సిపాల్ లీనాకుమారిలు మాట్లాడుతూ దివ్యాంగులకు మంజూరు చేసే పథకాలను తల్లిదండ్రులు సద్వినియోగం చేసుకోవాలన్నారు.

## 23న కురబల అత్యవసర సమావేశం

రాష్ట్ర అధ్యక్షులు జబ్బల శ్రీనివాసులు

మదనపల్లె, జులై 19 ప్రభాతవార్త :



కురబ, కురమ సంఘం రాష్ట్ర కార్యాలయం పట్టణంలోని ఎగువ కురవంక నందు ఈనెల 23న ఆదివారం ఉదయం 10గంటలకు అత్యవసర సమావేశం నిర్వహించనున్నట్లు రాష్ట్ర అధ్యక్షులు జబ్బల శ్రీనివాసులు తెలిపారు. బుధవారం ఆయన విలేకర్లతో మాట్లాడుతూ ఇటీవల కొంతమంది ఇతర జిల్లా కురబ కులంకు చెందిన వారు రాష్ట్ర కమిటీపైన నిరాధారణమైన ఆరోపణలు చేశా రన్నారు. ఈ ఆరోపణలపైన చర్చా కార్యక్రమం కోసం అత్యవసర సమావేశం ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. నూతన జిల్లాల కార్యవర్గ సభ్యులు, రాష్ట్ర సంఘానికి సహకరిస్తున్న అధికారులు, వ్యాపారస్తులు, చిరుద్యోగులు ఈ సమావేశానికి హాజరై జయప్రదం చేయాల్సిందిగా ఆయన కోరారు.

## జనసేన పార్టీని ఆదరించండి

జనసేన నాయకులు రామాంజనేయులు

మదనపల్లె, జులై 19 ప్రభాతవార్త :



జనసేన పార్టీని ఆదరించాలని పట్టణంలోని ఆర్ఆర్ జ్యువలరీస్ యజ మాని, జనసేన నాయకులు రామాంజనేయులు తెలిపారు. బుధవారం ఆయన విలేకర్లతో మాట్లాడుతూ 2024 ఎన్నికల్లో జనసేన పార్టీని గెలిపించాలని కోరారు. ప్రభుత్వం చేపడుతున్న ప్రజావ్యతిరేక విధానాలను నియోజకవర్గమంతా పర్యటించి ప్రజల్లోకి తీసుకెలుతానన్నారు. నియోజకవర్గంలో జనసేన పార్టీ సభ్యత్వ నమోదు కూడా శ్రీకారం చుట్టనున్నట్లు తెలిపారు. ప్రజలు జనసేన పార్టీ నిర్వా హకులు పవన్‌కల్యాణ్‌పై విశేష అభిమానం చూపుతున్నారన్నారు. ప్రతి జనసేన కార్యకర్తల సైనికుల్లా పనిచేసి పార్టీని బలోపేతం చేయాలన్నారు. పవన్‌కళ్యాణ్ ప్రవేశపెడుతున్న సిద్ధాంతాలను ప్రజల్లోకి తీసుకెళ్ళాలన్నారు.

## భార్యపై హత్యాయత్నం

మదనపల్లెక్రైం, జులై 19 ప్రభాతవార్త



భార్యపై కత్తితో భర్త దాడిచేసి హత్యాయత్నానికి పాల్పడిన సంఘటన మదనపల్లెలో జరిగింది. ఇందుకు సంబంధించిన పోలీసుల కథనం మేరకు వివరాలిలా వున్నాయి. మదనపల్లె రూరల్ మండలంలోని కొత్తపల్లె పంచాయితీ మోతీనగర్‌కు చెందిన షాహీదాభాను(22), మహమ్మద్‌యాసిన్ షామీర్‌లు ఏడాది క్రితం వివాహం చేసుకొన్నారు. పట్టణంలోని నక్కలదిన్నెలో నివాసం ఉంటున్నారు. బాధితురాలు ప్రస్తుతం గర్భిణి, ఈనేపథ్యంలో భర్త మూడు నెలల క్రితం నగలను తాకట్టు పెట్టి డబ్బు తీసుకొన్నాడు. ఈ విషయంపై మంగళవారం రాత్రి దంపతుల మద్య గొడవ జరిగింది. దీంతో ఆవేశానికి గురైన భర్త కత్తితో భార్యపై దాడిచేసి హత్యాయత్నానికి పాల్పడ్డాడు. తీవ్రంగా గాయపడిన ఆమెను స్థానికులు జిల్లా ఆసుపత్రికి తరలించారు. ఈ మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు తాలూకా పోలీసులు తెలిపారు.

## యాసిడ్ తయారీదారులు నిబంధనలు పాటించాలి

తయారీదారుల సమావేశంలో డిఎస్పి కేశప్ప

మదనపల్లెక్రైం, జులై 19 ప్రభాతవార్త



యాసిడ్ తయారీ, విక్రయదారులు నిబంధనలు పాటించాలని డిఎస్పి కేశప్ప పేర్కొన్నారు. బుధవారం స్థానిక డిఎస్పి కార్యాలయంలో యాసిడ్ తయారీ దారులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ యాసిడ్ దాడులు పెరిగిన నేపథ్యంలో తయారీ, విక్రయదారులతో సమావేశం నిర్వహించి పలు సూచనలు, సలహాలు, జాగ్రత్తలు చెప్పారు. ముఖ్యంగా విక్రయ దారులు తప్పనిసరిగా రిజిష్టర్ మెయింటైన్ చేయాలన్నారు. కొనుగోలుదారులు చిరునామా, ఫోన్‌నెంబర్ రిజిష్టర్‌లో నమోదు చేయాలన్నారు. 18ఏళ్ళు నిండిన వారికి మాత్రమే యాసిడ్ విక్రయించాలన్నారు. కళాశాల ల్యాబ్ సిబ్బంది అప్రమత్తంగా ఉండాలన్నారు. నిబంధనలు మేరకు తయారీ, విక్రయాలు నిర్వహించాలని అతిక్రమిస్తే చట్టరిత్యా చర్యలు తీసుకొంటామని డిఎస్పి హెచ్చరించారు. ఈ సమావేశంలో సిఐ మురళీక్రిష్ణ, సత్యనారాయణ, మహబూబ్‌బాషా, రెండవ పట్టణ ఎస్ఐలు పాల్గొన్నారు.

## అభివృద్ధి చేసే ప్రభుత్వాన్ని ఆదరించండి

పీలేరు, జూలై19 ప్రభాతవార్తః



పేదలకు అభివద్ధి చేసే ప్రభుత్వాన్ని ఆదరించాలని యువ పారిశ్రామిక వేత్త జీవి. రాకేష్‌రెడ్డి అన్నారు. బుధవారం పట్టణంలోని తిరుపతి రోడ్డు , నాయి బ్రాహ్మణ, రజకుల కాలనీలో ఇంటింటికి వెళ్లి ప్రభుత్వ అభివద్ధి సంక్షేమం గురించి వివరించారు. స్థానికంగా ఉన్న సమస్యలను తమ దష్టికి వచ్చిన తక్షణమే పరిష్కరించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్ర సీఎం జగన్ మోహన్‌రెడ్డి ఎన్నికల మేనిఫెస్టోలో ఇచ్చిన హామీలు 99 శాతం అమలు చేశారని అన్నారు. పార్టీలకు అతీతంగ ప్రభుత్వ సంక్షేమ పథకాలు ప్రతి కుటుం బానికి పారదర్శకంగా అందుతున్నాయని, మళ్లీ సీఎం జగన్‌మోహన్‌రెడ్డిని ఆశీర్వ దించాలని కోరారు. కార్యక్రమంలో సర్పంచి హబీబ్ బాషా, మండల కన్వీనర్ దండుజగన్ మోహన్‌రెడ్డి నాయకులు స్టాంపుల నరసిం హారెడ్డి, విజయశేఖర్ రెడ్డి, సాంబశివారెడ్డి, మల్లికార్జునరెడ్డి, బాలం నరేంద్ర రెడ్డి, మధుసూదన్‌రెడ్డి, అరుణ, మల్లికార్జున, మహేశ్వరరెడ్డి, సురేంద్రనాథరెడ్డి పాల్గొన్నారు.

## ఘనంగా అమ్మవారికి అభిషేకాలు

రామసముద్రం, జులై 19 ప్రభాతవార్త :



మండల కేంద్రంలోని బిసి కాలనీ వాసులు బుధవారం వేకువజామున శ్రీ దుర్గాలమ్మకు మహిళలు ఉపవాసాలతో భక్తి శ్రద్దలతో దీపాలు మోసి మొక్కులు తీర్చుకొన్నారు. అమ్మవారికి ఉదయం అభిషేకాలు, అర్చనలు నిర్వహించి ప్రత్యేక పూజలు చేశారు. ఆలయం వద్ద అనదాన కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో బిసి కాలనీవాసులు పాల్గొన్నారు.

## జయరామ్‌నాయుడును కలిసిన మండల టిడిపి నాయకులు

రామసముద్రం, జులై 19 ప్రభాతవార్త



మండలంలోని టిడిపి నాయకులు బుధవారం మదనపల్లెలోని జయరామ్ నాయుడు నివాసంలో మర్యాదపూర్వకంగా కలిశారు. ఈయనను కలిసిన వారిలో చలపతినాయుడు, శ్రీరాములురెడ్డి, పంచాయితీ సర్పంచ్ ఇంజం వెంకటరమణ, డాక్టర్ శివ, పొదుపు వెంకటరమణలు కలిసిన వారిలో కలరు. ఈ సందర్భంగా జయరామ్‌నాయుడు మాట్లాడుతూ రామసముద్రం మండలంలోని టిడిపి నాయ కులు, కార్యకర్తలకు ఎల్లప్పుడు అందుబాటులో ఉంటానని తెలిపారు. ప్రతి టిడిపి కార్యకర్త వైసిపి చేస్తున్న అరాచకాలను ప్రజల్లోకి తీసుకెళ్లి, రాబోయే 2024 ఎన్నికల్లో టిడిపిని గెలిపించి ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడును గెలిపించుకోవాలని వారికి సూచించారు.

## మైనారిటీ గురుకులంతో పిల్లలకు ఉజ్వల భవిష్యత్తు

– రాష్ట్ర ఉర్దూ అకాడమి డైరెక్టర్ అబ్దుల్ కలీమ్

వాల్మీకిపురం, జూలై 19ప్రభాతవార్తః



వాల్మీకిపురంలోని ప్రభుత్వ మైనారిటీ గురుకుల పాఠశాలలో అభ్యసించే పిల్లలకు ఉజ్వల భవిష్యత్తు ఉంటుందని రాష్ట్ర ఉర్దూ అకాడమి డైరెక్టర్ అబ్దుల్ కలీమ్ అన్నారు. బుధవారం స్థానిక మైనారిటీ బాలకల గురుకుల పాఠశాల ప్రిన్సిపాల్ ఏఆర్.మంజుల సూచనల మేరకు ఉపాధ్యాయులు అడ్మిషన్లు ప్రచార కార్యక్రమాన్ని చేపట్టారు. ఈసందర్భంగా ఉర్దూ అకాడమి డైరెక్టర్ కలీమ్ మాటాడుతూ ఎమ్మెల్యే చింతల రామచంద్రారెడ్డి ప్రత్యేక కషితో 2003లో ఈగురుకుల పాఠశాలను ప్రారంభించడం జరిగిందని ఈపాఠశాలలో అనుభవజ్ఞులైన ఉపాధ్యాయులు, నాణ్యమైన విద్య అందుబాలో ఉందన్నారు. రాష్ట్రంలోనే సీబీఎస్ఈ సెంట్రల్ సిలబస్ అమలులో ఉన్న తొలి మైనారిటీ గురుకుల పాఠశాలగా ఈ పాఠశాల గుర్తింపు పొందిందని ఈపాఠశాలలో ఇంగ్లీషు మీడియంలో అడ్మిషన్లు నిర్వహిస్తు న్నప్పటికి ఉర్దూను ఫస్టు లాంగ్వేజీగా బోధిస్తున్నట్లు తెలిపారు. ప్రస్తుతం 5వ తరగతిలో అడ్మిషన్లు చేపడుతున్నట్లు ఎలాంటి ఎంట్రన్సు టెస్టు, రుసుములు లేకుండా ఉచితంగా అడ్మిషన్లు చేపడుతున్నట్లు ఇక్కడ చేరే విద్యార్థులుకు ఉచిత విద్య, వసతి భోజన సదుపాయాలు పిల్లల ఆరోగ్య పట్ల ప్రత్యేక శ్రద్ద తీసుకోవడం జరుగుతుందని తెలిపారు. తల్లిదండ్రులు 5వ తరగతి విద్యాభ్యాసం కోసం తమ పిల్లలను ఈగురుకుల పాఠశాలలో చేర్పించాలని మరిన్ని వివరాలకు 9866559649ను సంప్రదించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో మండల కోఆప్షన్ సభ్యులు మహబూబ్‌బాషా, విశ్రాంతి ఉపాధ్యాయులు జిలాని, సయ్యద్ అజం, షఫీ తదితరులు పాల్గొన్నారు.

## బంగారు నగలు అమ్ముతాం- కరిగిస్తాం- అనే వ్యక్తులపై తక్షణమే సమాచారం ఇవ్వండి

వాల్మీకిపురం, జూలై 19 ప్రభాతవార్తః



కొత్త వ్యక్తుల కదలికలపై అనుమానాలు వచ్చిన బంగారు నగలకు సంబంధించి కరిగిస్తామని, లేదా నగలు అమ్ముతామని వచ్చే వ్యక్తులపై తక్షణమే సమాచారం ఇవ్వాలని స్థానిక ఎస్సై నాగేశ్వరరావు అన్నారు. బుధవారం స్థానిక శ్రీసత్యలక్ష్మీ కళ్యాణ మండపంలో బంగారు నగల దుకాణ యజమానులు, బంగారు నగల తయారీదారుల సమావేశాన్ని ఏర్పాటు చేశారు. ఈసమావేశాన్ని ఉద్దేశించి ఎస్సై మాట్లాడుతూ పట్టణంలోని బజారు వీధిలో ఎవరైనా బంగారు అమ్ముతామని కొత్త వ్యక్తులు వచ్చి బంగారు నగలు కుదవ పెడతామని చెబితే వారి ఆధార్‌కార్డు చూసి వ్యవహారం చేయాలని కొత్త వ్యక్తులని అనుమానం వస్తే తక్షణమే పోలీసులకు సమాచారం ఇవ్వాలని ఎస్సై సూచించారు. నమ్మకమైన వ్యక్తులతో వ్యవహారం ఇబ్బంది ఉండదని, కొత్త వ్యక్తులైతే ఇబ్బందికరంగా మారు తుందని తెలియజేశారు. కార్యక్రమంలో బంగారు నగల దుకాణ యజమానులు శ్రీనివాసులు, హరి, రెడ్డెప్ప, శివ, స్వర్ణకార సంఘం నాయకులు కువైట్ శంకరాచారి, కష్ణమోహన్, మస్తాన్ ఆచారి, శాంతాచారి పాల్గొన్నారు.

## రాజు హైస్కూల్లో ఎన్‌సిసికి విద్యార్థుల ఎంపిక

రాజంపేట అర్బన్, జులై 19 ప్రభాతవార్త



రాజంపేట పట్టణం రాజు హైస్కూల్లో ఎన్‌సిసిలో విద్యార్థులను ఎం పిక చేసే ప్రక్రియ జరిగింది. కడప ఎన్‌సిసి బెటాలియన్ సుబేదార్ హరింధర్‌సింగ్, హవల్దార్ సమయాసింగ్‌లు విద్యార్థులకు ఎంపిక ప్రక్రియ నిర్వహించారు. అందులో భాగంగా దేహదారుఢ్య పరీక్షలు, శారీరక దృఢత్వం, పరుగు పందెం, మానసిక పరిస్థితులను, చేతులు, పాదాలను ఎన్‌సిసి అధికారులు పరీక్షించారు. అనంతరం మౌఖిక ప్రశ్నలు వేశారు. కార్యక్రమంలో రాజు హైస్కూల్ గోపాల్‌రెడ్డి, ప్రధానోపాధ్యాయులు రఘురామరాజు, అకడమిక్ ఇన్‌ఛార్జి శేషారెడ్డి, ఎఎన్ఓ ఓబుల్‌రాజు, సిటిఐ హరి తదితరులు పాల్గొన్నారు. 28 మందిని ఎంపిక చేసినట్లు తెలుస్తోంది.

## ఆశ కార్యకర్తలతో ఆన్‌లైన్ పనులు చేయించరాదు

ఏఐటీయూసీ జిల్లా ప్రధానకార్యదర్శి సాంబశివ

పీలేరు, జూలై 19ప్రభాతవార్తః



నియోజకవర్గంలోని పలు పీహెచ్‌సీల పరిధి లో పనిచేస్తున్న ఆశ కార్యకర్తల నుంచి వారికి సంబంధంలేని ఆన్‌లైన్ పనులు ఆశల దగ్గర చేయించరాదని జిల్లాలో కొంతమంది మెడికల్ ఆఫీసర్లు అత్యవసర పరిస్థితుల్లో ఆశా కార్య కర్తలకు సెలవులు ఇవ్వకుండా బెదిరింపులకు గురిచేస్తున్నారని ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి సాంబశివ బుధవారం ఓ ప్రకటనలో ఆరోపించారు. ఏళ్ల తరబడి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకు సంబంధించిన సర్వేలు పేద ప్రజలకు వైద్యసేవలు అందిస్తున్న ఆశ కార్యకర్తలను ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించి కనీస వేతనం అమలు చేయకుండా ప్రభుత్వాలు వారి నుంచి వెట్టి చాకిరి చేయించుకుంటున్నారని ఆరోపించారు. ఆశ కార్యకర్తలు అరాకొర చదువులు చదివి చాలా మంది ఆశ కార్యకర్తలుగా ఉంటున్నారని వారికి ఆన్‌లైన్ యాప్‌లు పెట్టి అప్‌లోడ్ చేయాలని లేకపోతే ఉద్యోగాలు మానేయండి అంటూ ఇబ్బందులకు గురి చేస్తు న్నారని సంబంధించిన శిక్షణ ఆశ కార్యకర్తలకు మెడికల్ అధికారులు ఇవ్వాలని కోరారు. 3వేలు, 4వేలు జనాభాకు ఒక ఆశ కార్యకర్తనే నియమించి పనిభారం పెంచారని 1500 ఉన్న జనాభాకు ఒక ఆశ కార్యకర్తను నియమించి పని భారాన్ని తగ్గించాలని కోరారు.

## ఓటర్ల జాబితాలను పరిశీలించాలి

కమలాపురం, జులై 19, ప్రభాతవార్త:



కమలాపురం మండల పరిషత్ సమావేశ భవనంలో బుధవారం కమలాపురం నియోజకవర్గ ఎన్నికల అధికారి ఆర్.ఓ చంద్రమోహన్ కమలాపురం మండల వ్యాప్తంగా ఉన్న బీఎల్‌ఓలకు పోలింగ్ బూతులలో ఓటర్ల జాబితాలను పరిశీలించి ఇంటింటికి వెళ్లి తనిఖీ చేయాలన్నారు. మరికొన్ని అంశాలపై శిక్షణ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ సరస్వతి, డీటీలు నరేంద్ర, అర్జున్, బీఎల్‌ఓలు, సచివాలయ సిబ్బంది, వీఆర్వోలు పాల్గొన్నారు.

## ప్రారంభమైన మొహారం వేడుకలు

చిన్నమండెం, జులై 19ప్రభాతవార్త:



మండల కేంద్రంలో జిల్లాలోనే అత్యంత ఘనంగా హిందూ ముస్లిం సోదరులు కలిసి జరుపుకొనే మొహారం వేడుకలు నెలవంక కనిపించడంతో బుధవారం నుండి ప్రారంభమయ్యాయి. ఈ సందర్భంగా పీర్లమకాన్ కమిటీ పెద్దలు గంగపు పీరుపెట్టెలను కిందికి దించి చదివింపులు చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ 9 రోజుల పాటు అంగరంగ వైభవంగా జరిగే పీర్లపండుగ వేడుకలు గురువారం నుండి ప్రారంభమవుతాయన్నారు. 3వ రోజు గంధప పీరును ప్రతిష్టిస్తారు. అప్పటి నుండి రోజుకొక కార్యక్రమంలో అత్యంత ఘనంగా జరుపుతోంది. గంధపు పీరు బాసికం ఈ ఏడాది దివంగత షాబాద్ అలీఖాన్ కుమారుడు ప్రముఖ పారిశ్రామిక వేత్త ఏజాస్ అలీఖాన్ ఇవ్వనున్నారు. ఈ సందర్భంగా పంజాబ్, బళ్లారి నుండి డ్రమ్ము వాయిద్య కళాకారులను ప్రత్యేకంగా ఏర్పాటు చేశారు. ఈ బాసికం, గంధపు పీరు మెరవనికి జిల్లా వాసులే కాక పక్క రాష్ట్రాల నుండి కూడా ముస్లిం సోదరులు వేలాదిగా తరలివస్తారు. 9 రోజులపాటు మండల కేంద్రంలో మొహారం వేడుకల సందడి నెలకొననుంది.

## ఏడుగురు జూదరులు అరెస్టు

దువ్వూరు, జులై 19, ప్రభాతవార్త:

మండల పరిధిలోని పెద్దసింగనపల్లె గ్రామంలో బుధవారం జూదం ఆడుతున్న ఏడుమందిని అరెస్టు చేసి వారి వద్ద నుంచి రూ.9వేలు నగదు స్వాధీనం చేసుకున్నట్లు ఎస్సై శ్రీనివాసులు తెలి పారు. ముందుగా రాబడిన సమాచారం మేరకు ఈ దాడులు చేశామన్నారు. అరెస్టు చేసిన వారిని త్వరలో మైదుకూరు కోర్టులో హాజరు పరుస్తున్నట్లు తెలిపారు.

## కమలాపురం నియోజకవర్గ కాపు కన్వీనర్‌గా జొన్నలగడ్డ సురేష్

కమలాపురం, జులై 19, ప్రభాతవార్త:



కమలాపురం పట్టణానికి చెందిన జొన్నలగడ్డ సురేష్ రాయల్‌ను కడప జిల్లా కమలాపురం నియోజకవర్గం కాపు కన్వీనర్‌గా నియమించినట్లు రాష్ట్ర కాపు జేఏసీ ఛైర్మన్ అమ్మ శ్రీనివాస్ నాయుడు మరియు కడప కాపు జేఏసీ కన్వీనర్ బండి ప్రతాప్‌లు తెలిపారు. ఈ సందర్భంగా జొన్నలగడ్డ సురేష్ మీడియాతో మాట్లాడుతూ నాపై నమ్మకం ఉంచి నియోజకవర్గ కాపు కన్వీనర్‌గా నియమించి నందుకు జేఏసీ ఛైర్మన్ అమ్మ శ్రీనివాస్‌నాయుడు, కాపు జేఏసీ కన్వీనర్ బండి ప్రతాప్‌లకు కృతజ్ఞతలు తెలిపారు. నియోజకవర్గంలోని ప్రతి ఒక్క కాపు సోదర సోదరీ మణులను కలిసి వారికి స్థానికంగా ఉన్న సమస్యలపై తమ అధ్యక్షుల దృష్టికి తీసుకెళ్లి సమస్య పరిష్కరించే దిశగా అడుగులు వేస్తామన్నారు. నాకు అప్పగిం చిన బాధ్యతలు తన వంతు కృషి చేస్తానని తెలిపారు.

## టి.చదిపిరాళ్లలో జగనన్న సురక్ష

కమలాపురం, జులై 19, ప్రభాతవార్త:



టి.చదిపిరాళ్ల గ్రామంలో బుధవారం జగనన్న సురక్ష కార్యక్రమం నిర్వహించారు. ముఖ్య అతిథిగా పాల్గొన్న కమలాపురం ఎమ్మెల్యే పి.రవీంద్రనాథ్‌రెడ్డి 11 రకాల సర్టిఫికెట్లను ప్రజలకు అందజేశారు. కార్యక్రమంలో అధికారులు, వైసీపీ నాయకులు, కార్యకర్తలు, అధిక సంఖ్యలో ప్రజలు పాల్గొన్నారు.

## రావణ కాష్టంగా ఏపీ

కమలాపురం, జులై 19, ప్రభాతవార్త:



విజయనగరంలో టీడీపీ సానుభూతి పరులైన కృష్ణ మాస్టారును వైసీపీ సైకోలు వాహనంతో గుద్ది వాహనానికి కట్టి ఈడ్చుకెళ్లి కళ్లలో పొడిచి చావబాది చంపినా కౌన్సెలింగ్‌కు పిలిచారని ఒక్క దళిత ఎస్సైపై పోలీసు స్టేషన్‌లోనే చెయ్యి చేసుకున్న వైసీపీ నాయకుడిపై చర్యలు తీసుకోకపోగా 2 గంటలలోనే విడిపించడం దారుణమని కడప పార్లమెంటు తెదేపా మైనార్టీ అధ్యక్షులు ఖాదర్‌బాషా ధ్వజమెత్తారు. బుధవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ రాష్ట్రం రావణ కాష్టంలా మారిందని వాపోయారు. తప్పులు చేసిన వారిని కనీస చర్యలు తీసుకోలేని పరిస్థితిలో ఉండడం దుర్మార్గ పాలనకు పరాకాష్టన్నారు. ఈ సైకో సీఎంను, వైసీపీ నాయకులను ఇంటికి పంపి రాష్ట్రాన్ని విజన్‌తో అభివృద్ధి చేసి ముందుకు తీసుకోయే నాయకుడు నారా చంద్రబాబునాయుడు అని పుత్తా నరసింహారెడ్డికి ఓటు వేసి గెలిపించాలని ఆయన కోరారు. ఈ సమావేశంలో కమలాపురం తెదేపా మండల అధ్యక్షులు రాఘవరెడ్డి, కడప పార్లమెంటు మైనార్టీ అధ్యక్షులు ఖాదర్ బాషా, గండి నారాయణ, తెదేపా నాయకులు పాల్గొన్నారు.

## డివిజన్ అభివృద్ధి పనులపై సీఎంను కలిసిన వైకాపా నేత అక్బర్

కడప కార్పొరేషన్, జులై 19, ప్రభాతవార్త:



34వ డివిజన్ అభివృద్ధి పనులపై సీఎం వైఎస్.జగన్‌మోహన్‌రెడ్డిని 34వ డివిజన్ వైకాపా ఇన్‌ఛార్జి అలీ అక్బర్ కలిశారు. ఓవర్ హెడ్ ట్యాంక్ నిర్మాణం జరుగుతుందని తెలిపారు. 34 డివిజన్‌లో నీటి సమస్య లేకుండా చేస్తామన్నారు. నూతనంగా 20 సెంట్ల స్థలంలో పాఠశాల నిర్మాణం జరుగుతుందన్నారు. ఉప ముఖ్యమంత్రి ఎస్.బి.అంజాద్‌బాషా, మేయర్ కె.సురేష్‌బాబులతో కలిసి వెళ్లడం జరిగింది.

## న్యాయం కావాలి..



కడప కార్పొరేషన్, జులై 19, ప్రభాతవార్త: వారసత్వంగా నా భర్తకు సంక్రమించిన స్థిర ఆస్తిని ఆక్రమించడానికి కొంత మంది ప్రయత్నిస్తున్నారని కడప చిన్నచౌకు ప్రాంత దళిత మహిళ కె.వి.రాజ్యలక్ష్మి ఆరోపించారు. తహసీల్దార్ ఆదేశాల మేరకు చిన్నచౌకులోని మా స్థలంలో సర్వేయర్ సర్వే చేయడం జరిగిందన్నారు. సర్వే చేయొద్దని వారికి లీగల్ నోటీసులు ఇచ్చామన్నారు. వారి భారి నుంచి మా ఆస్తిని కాపాడాలని జిల్లా అధికారులకు విజ్ఞప్తి చేశారు.

## బదిలీ ఉపాధ్యాయులకు సన్మానం

సంబేపల్లె, జులై 19, ప్రభాతవార్త:



సంబేపల్లె ప్రాథమిక పాఠశాలలో విద్యార్థుల భవిష్యత్తు కోసం విశిష్ట సేవలు అందించి బదిలీపై వెళ్లిన ఉపాధ్యాయులకు బుధవారం సన్మాన కార్యక్రమం నిర్వహించినట్లు ఎంఈవో రమాదేవి తెలిపారు. ప్రధానోపాధ్యాయుడు నాగార్జున, ఉపాధ్యాయులు, రామ్మోహన్, ఉపాధ్యాయురాలు రాజారాణెమ్మ అందించిన సేవలపై కొనియాడారు. అనంతరం శాలువా కప్పి సన్మానించారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయ సంఘం నాయకులు రెడ్డన్న, నల్లమల రామాంజులు, ప్రభాకర్‌రెడ్డి, సంబేపల్లె ప్రాథమిక పాఠశాల ప్రధానోపాధ్యాయుడు నాగేశ్వర్‌నాయక్, రెడ్డయ్య రాజు, జయమ్మ తదితరులు పాల్గొన్నారు.

## చైతన్యరథంలో పాల్గొన్న మాసా కోదండరామ్

కడప వైద్యవిభాగం, జులై 19, ప్రభాతవార్త:



తెదేపా భవిష్యత్తుకు గ్యారెంటీ చైతన్య రథం బుధవారం కడప నియోజకవర్గానికి విచ్చేసిన సందర్భంగా టీడీపీ నాయకులతో కలిసి తెదేపా పద్మశాలీ సాధికార సమితి రాష్ట్ర సభ్యులు మాసా కోదండరామ్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన తెదేపా ప్రభుత్వం వస్తేనే ప్రజలు, రాష్ట్రం అభివృద్ధి చెందుతుందని తెలిపారు.

# సక్రమమైన ఓటర్ల జాబితాను రూపొందించాలి

**దువ్వూరు, జులై 19, ప్రభాతవార్త:**



గ్రామాల్లోని బీఎల్‌ఓలు, సూపర్‌వైజర్లుందరూ కలిసి ఎటువంటి తప్పులు లేని ఓటర్ల జాబితాను రూపొందించాలని ఎలక్ట్రోరల్ రిజిస్ట్రేషన్ ఆఫీసర్ స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ నరసింహులు అన్నారు. బుధవారం స్థానిక ఎంపీడీవో కార్యాలయంలోని సభాభవనంలో ఓటర్ల జాబితా, మార్పులు, చేర్పులు వంటి విషయాలపై బీఎల్‌ఓలు, సూపర్‌వైజర్ల సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇంటింటికి వెళ్లి సర్వే నిర్వహించాలని వాటిపై అవగాహన కలిగి ఉండాలన్నారు. ప్రజలు తమ ఓటు హక్కు ఉందో లేదో బీఎల్‌వోల పర్యటనలో తమ పేర్లు ఓటర్ల లిస్టులో సరిచూసుకోవాలని తెలిపారు. ఈ సమావేశంలో తహసీల్దార్ రమాకుమారి, మధు తదితరులు పాల్గొన్నారు.

# అభివృద్ధికి పెద్దపీట వేస్తున్న ప్రభుత్వం

**వేంపల్లె, జూలై 19, ప్రభాతవార్త ః**



రాష్ట్ర ప్రభుత్వం అభివృద్ధికి పెద్దపీట వేస్తోందని పులివెందుల ప్రాంత అభివృద్ధి సంస్థ (పాడా) ప్రత్యేకాధికారి అనీల్‌కుమార్‌రెడ్డి అన్నారు. బుధవారం మండల కేంద్రమైన వేంపల్లెలో పాడా నిధులతో నిర్మించిన తహసీల్దారు కార్యాలయ అదనపు గదులను ఆర్డీవో వెంకటేషు, తహసీల్దారు చంద్రశేఖర్‌రెడ్డి, జడ్పీటీసీ సభ్యుడు రవికుమార్‌రెడ్డి, ఎంపీపీ లక్ష్మిగాయత్రిలతో కలిసి ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం జిల్లాలోని వివిధ ప్రభుత్వ కార్యాలయాల ఆధునికీకరణ, అదనపు గదులు, నూతన భవనాలు ప్రారంభించడం జరుగుతోందన్నారు. దాదాపు రూ.15లక్షల వ్యయంతో తహసీల్దారు నూతన చాంబర్‌తో పాటు అర్జీదారుల కోసం ప్రత్యేక గదిని ఏర్పాటు చేశామన్నారు. అలాగే సమస్యల పరిష్కారం, వివిధ పనుల కోసం వచ్చే ప్రజలకు వసతులు, సౌకర్యాలు కల్పించారన్నారు. అంతేకాకుండా తహసీల్దారు కార్యాలయ ముఖచిత్రం, డిజైన్ అత్యంత సుందరంగా తీర్చిదిద్దారని సంతోషం వ్యక్తం చేశారు. అందుకు తహసీల్దారు ఎన్.చంద్రశేఖర్‌రెడ్డిని ఓఎస్డీ అభినందించారు. స్పందన ద్వారా వచ్చే అర్జీదారుల సమస్యలను జాప్యం లేకుండా త్వరితగతిన పరిష్కరించాలని సూచించారు. ప్రజలకు మరిన్ని మెరుగైన సేవలు అందించేందుకు రాష్ట్ర ప్రభుత్వం కృషి చేస్తోందన్నారు. ప్రజలు కూడా ప్రభుత్వం అందిస్తున్న సేవలను సద్వినియోగం చేసుకోవాలన్నారు.

# యాసిడ్ దాడుల పట్ల ప్రజలు అప్రమత్తంగా వుండాలి

## సీఐలు సుధాకర్‌రెడ్డి, లింగప్ప

**రాయచోటి, జూలై 19, ప్రభాతవార్త ః**



రాయచోటి నియోజవర్గంలో యాసిడ్ దాడుల పట్ల ప్రజల అప్రమత్తంగా ఉండాలని రాయచోటి అర్బన్ రూరల్ సర్కిల్ ఇన్స్పెక్టర్లు సుధాకర్ రెడ్డి లింగప్పలు కోరారు గురువారం రాయచోటి పోలీస్ స్టేషన్లో విలేకరుల సమావేశంలో వారు మాట్లాడుతూ రాష్ట్రంలో జరుగుతున్న యాసిడ్ దాడుల దృష్ట్యా ముందుస్తుగా ప్రజలను అప్రమత్తం చేస్తున్నట్లు చెప్పారు. అనుమతులు లేనిదే యాసిడ్ అమ్మకాలు ఎవరు చేయరాదని ,యాసిడ్ కొనుగోలు చేస్తున్న వారి రికార్డులు నమోదు చేయాలని, పిల్లలకు వృద్ధులకు యాసిడ్ అమ్మకం చేయరాదని, యాసిడ్ అమ్మలంటే కలెక్టర్ ఎస్పీ ల అనుమతులు తీసుకోవాలన్నారు. సోషియల్ మీడియా వేదికగా అభ్యంతకర పోస్టులు పెడితే చట్టపరమైన చర్యలు తీసుకోవడం జరుగుతుందన్నారు, ఎస్పీ ఆదేశాలు మేరకు తాము ప్రజలను అప్రమత్తం చేస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

**'వార్త'కు స్పందన**

# కొత్త విద్యుత్ స్తంభాలు ఏర్పాటు

**చిట్వేలి, జులై 19 ప్రభాతవార్త**



ప్రభాతవార్తలో జూన్ నెల 13న ప్రచురితమైన 'ప్రమాదం జరిగేంత వరకు పట్టించుకోరా?' అన్న శీర్షికకు చిట్వేలి మండల విద్యుత్తు అధికారి చలపతి తక్షణమే స్పందించారు. సి.కందులవారిపల్లె గ్రామ పరిధిలో రెండు చోట్ల ప్రమాద స్థితిలో ఉన్న విద్యుత్ స్తంభాలను తొలగించి, కొత్త వాటిని ఏర్పాటు చేశారని గ్రామ సర్పంచ్ యామల శ్రీదేవి ప్రభాతవార్తకు మంగళవారం సాయంత్రం తెలిపారు. విద్యుత్ అధికారి తీసుకొన్న సత్వర చర్యలకు ప్రచురించిన ప్రభాతవార్తకు గ్రామ పంచాయతిలోని ప్రజలందరి తరపున ధన్యవాదాలు తెలుపుతున్నట్లు సర్పంచ్ శ్రీదేవి అన్నారు.

# వ్యాధులు ప్రబలకుండా అప్రమత్తంగా ఉండాలి

## – జోనల్ మలేరియా అధికారి డా.కె.సరస్వతి

**కడప వైద్యవిభాగం, జులై 19, ప్రభాతవార్త:**



నగరంలోని చలమారెడ్డిపల్లి మురికివాడల్లో బుధవారం జోనల్ మలేరియా అధికారిణి డా.కె.సరస్వతి సందర్శించారు. అక్కడి ప్రజలకు మలేరియా, డెంగీ వంటి కీటక జనిత వ్యాధులు ప్రబలకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు. పరిసరాలు పరిశుభ్రత, మురికి నీటి కాల్వలు శుభ్రపరుచుట తదితర వాటిని గురించి తెలిపారు. ఫ్రైడేని డ్రైడేగా పాటించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో అడిషనల్ డైరెక్టర్ త్యాగరాజు, ఎఎంఓ వెంకటరెడ్డి, ఎస్‌యూఓ లక్షుమయ్య, ఎంపీహెచ్ఈవో నిత్యపూజయ్య, ల్యాబ్ టెక్నీషియన్, వైద్య సిబ్బంది, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు. అక్కడ వైద్య సిబ్బంది, ఆశాల పనితీరు ను పరిశీలించి తగు సూచనలు, సలహాలు అందించారు.

# సిసిరోడ్డు కాలువలకు భూమి పూజ చేసిన ఎమ్మెల్యే రాచమల్లు

**ప్రొద్దుటూరు జులై 19, ప్రభాతవార్త**



ప్రొద్దుటూరు మండలం కొత్తపల్లి పంచాయతీ పరిధిలోని బొంగు బజార్ వీధి షంషు మజీద్ ముస్లిం సోదరుల కోరిక మేరకు 25 లక్షల అంచనా వ్యయంతో సిసి రోడ్డు కాలువలకు ఎమ్మెల్యే రాచమల్లు శివప్రసాద్ రెడ్డి బుధవారం భూమి పూజ చేశారు. కొంతకాలంగా చుట్టుపక్కల ప్రాంతంలో నివసిస్తున్న 30 ముస్లిం కుటుంబాల సోదరులు రోడ్లు కాలువలు లేక ఇబ్బందులకు గురవుతున్నారని 26వ అవార్డు వైసిపి ఇంచార్జ్ పాలగిరి ఖాజా ఎమ్మెల్యే రాచమల్లు శివప్రసాద్ రెడ్డి దృష్టికి తీసుకురాగా స్పందించిన ఎమ్మెల్యే ముస్లిం సోదరులకు ఎలాంటి అసౌకర్యం కలగకూడదని బుధవారం ఎమ్మెల్యే రాచమల్లు శివప్రసాద్ రెడ్డి పూజ చేశారు. కోరిన వెంటనే 25 లక్షల రూపాయలు కేటాయించి రోడ్డు కాలువలు నిర్మాణానికి కృషిచేసిన ఎమ్మెల్యే రాచపల్లి శివప్రసాద్ రెడ్డికి ముస్లిం సోదరులు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో మజీద్ ఉత్తవుల్లా నజీర్ అహ్మద్ పి ఖాజా మొహద్దీన్ పాలగిరి ఖాజా స్థానిక ముస్లిం సోదరులు పాల్గొన్నారు.

# అసిస్టెంట్ గవర్నమెంటు ప్లీడర్‌గా ఊరిబిండి సూర్యనారాయణరెడ్డి

**బద్వేలు లీగల్, జూలై 19 ప్రభాతవార్త :**



రాష్ట్ర ప్రభుత్వం రాష్ట్రంలోని వివిధ న్యాయస్థానాలలో ఖాళీగా ఉన్న అసిస్టెంట్ గవర్నమెంట్ ప్లీడర్ నియామకాలలో భాగంగా కడప జిల్లా బద్వేలు అడిషనల్ సీనియర్ సివిల్ జడ్జి కోర్టు (ఎఫ్‌టిసి) రాజంపేట అట్ బద్వేలు న్యాయస్థానమునకు బద్వేలు న్యాయస్థానంలో న్యాయవాదిగా ఉన్న ఊరిబిండి సూర్యనారాయణ రెడ్డిని అసిస్టెంట్ గవర్నమెంటు ప్లీడర్‌గా నియమిస్తూ సెక్రటరీ టు గవర్నమెంట్ లీగల్ అండ్ మెజిస్లేటివ్ అఫైర్స్ అండ్ జస్టిస్ జిఓఆర్‌టి 240 లా(జి) డిపార్టుమెంట్ 19.7.2023 తేదీ నాడు నియామక ఉత్తర్వులను జారీ చేసింది. ఈ నియామకము ఈ తేదీ మొదలు 3 సంవత్సరముల పాటు అమలులో ఉంటుందని, ఈ స్థాయికి తాను ఎదగడానికి అవిరళ కృషి జరిపిన బద్వేలు ఎమ్మెల్యే డా॥ సుధ, ఎమ్మెల్సీ డి.సి.గోవిందరెడ్డిలకు తన హృదయపూర్వక శుభాభి వందనములు తెలుపుతూ తాను ఈ స్థాయికి ఎదగడానికి చేయూతనిచ్చిన తన మేనమామ, ప్రముఖ న్యాయవాది దేవిరెడ్డి బ్రహ్మారెడ్డికి సర్వత్రా కృతజ్ఞతలు తెలుపుకుంటూ ఈ సదవకాశాన్ని తాను చక్కగా వినియోగించుకొని ప్రభుత్వం తరుపున వచ్చే యావత్తు సివిల్ సమస్యలను శ్రద్ధాసక్తులతో చూస్తూ ప్రభుత్వానికి, ప్రభుత్వ ఉద్యోగులకు ఎంతగానో సహాయపడగలనని ఒక ప్రకటనలో తెలియజేశారు. బద్వేలు బార్ అసోషియేషన్‌లోని సభ్యులందరికీ తన కృతజ్ఞతాభి వందనములు తెలియజేశారు.

# మండల ప్రజలు అప్రమత్తంగా ఉండాలి

## ఎస్ఐ చంద్రమోహన్

**వీరబల్లి, జూలై 19 ప్రభాతవార్త :**

మండలంలోని ప్రజలు కొత్తవారిపట్ల అనుమానాస్పద వ్యక్తుల పట్ల అప్రమత్తంగా ఉండాలని మండల ఎస్సై చంద్రమోహన్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లా ఎస్పీ ఉత్తర్వుల మేరకు మహిళలపై జరుగుతున్న యాసిడ్ దాడుల నేపథ్యంలో జిల్లాలో యాసిడ్ అమ్ముతున్న షాపు యజమానులతో మీటింగ్ నిర్వహించి యాసిడ్ అమ్మడానికి వారికి సరైన అనుమతులు డాక్యుమెంట్లు ఉన్నాయా లేదా అని చెక్ చేసి వారు స్టాక్ సరిగా మెయింటైన్ చేయాలని యాసిడ్ అమ్మే వారి యొక్క వివరాలు సేకరించి అవసరం ఉన్నవారికి మాత్రమే అమ్మాలి అని చెప్పి అట్టు లేనియెడల చట్టపరమైన చర్యలు తీసుకొనబడును తెలియజేసారు.

**ఆరుగురు పేకాటరాయుళ్ల అరెస్ట్**

మండలంలోని సీతంపేట పంచాయతీలో బుధవారం అందిన సమాచారం మేరకు రైడ్ చేయగా 6 మంది పేకాట రాయులను అదుపులోనికి తీసుకుని వారి వద్ద నుండి రూ.4120లు దినపరుచుకుని వారిని అరెస్టు చేసి కేసు నమోదు చేశారని ఎస్సై చంద్రమోహన్ తెలిపారు. కార్యక్రమంలో పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

# అభివృద్ధిపై ఓపెన్ ఛాలెంజ్‌కు సిద్ధమా

## – ఎంపీపీ ఆవుల నాగశ్రీలక్ష్మీ, జడ్పీటీసీ గొర్ల కవిత



**సంబేపల్లె, జులై 19, ప్రభాతవార్త:**

ప్రజా సేవకుడు ఎమ్మెల్యే శ్రీకాంత్‌రెడ్డి పాలనలో సంబేపల్లె మండలంలో ఎలాంటి అభివృద్ధి జరగలేదని విమర్శించిన మాజీ జడ్పీటీసీ మల్లు నర్సారెడ్డి అభివృద్ధిపై ఓపెన్ ఛాలెంజ్‌కు సిద్ధమా అని ఎంపీపీ ఆవుల నాగశ్రీలక్ష్మీ, జడ్పీటీసీ గొర్ల కవిత, డీసీఎంఎస్ మాజీ ఛైర్మన్ ఆవుల విష్ణు వర్ధన్‌రెడ్డిలు ఛాలెంజ్ విసిరారు. బుధవారం సంబేపల్లె ఎంపీడీవో కార్యాలయంలో వైసీపీ ప్రజా ప్రతినిధులు నాయకులతో కలిసి విలేకరుల సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ అభివృద్ధిలో మా ఎమ్మెల్యే శ్రీకాంత్‌రెడ్డి ముందు ఉంటాడని ప్రజా నాయకుడు, ప్రజా సేవకుడిని విమర్శించడం తగదన్నారు. అభివృద్ధిపై చర్చకు సిద్ధమా అని వైసీపీ శ్రేణుల్లో ఎవరిని కోరుకున్నా వారు చర్చకు వస్తారని తెలిపారు. కోట్లు ఖర్చు పెట్టి అభివృద్ధి పనులు చేస్తుంటే మీ కంటికి కనిపించకపోవడం విడ్డూరంగా ఉందన్నారు. విమర్శలు మానుకొని మండల అభివృద్ధిపై దృష్టి పెట్టాలని సూచించారు. ఈ కార్యక్రమంలో మాజీ జడ్పీటీసీ ఉపేంద్రరెడ్డి, ఉప మండలాధ్యక్షులు పి.రవీంద్రనాయుడు, సర్పంచులు చిదంబర రెడ్డి, అంచల రామచంద్ర, మోహన్, ఎంపీటీసీ భద్రయ్య, వైసీపీ నాయకులు గొర్ల రమేష్‌రెడ్డి, వాసుదేవంరెడ్డి, బ్రహ్మానందరెడ్డి, ఆనంద్‌కుమార్‌రెడ్డి, పాల వెంకటరమణ, పలువురు వైసీపీ నాయకులు పాల్గొన్నారు.

# మహాత్మాగాంధీ యూత్ స్టడీ హాల్‌ను ప్రారంభించిన కమిషనర్

**కడప వైద్యవిభాగం, జులై 19, ప్రభాతవార్త:**



కడప ప్రాంతంలోని నిరుద్యోగ మరియు మధ్యతరగతి యువతీ యువకులకు, పోటీ పరీక్షలకు సిద్ధమవుతున్న అనేక మంది చదువుకోవడానికి ఈ స్టడీ హాలు ఎంతో ఉపయోగపడుతుందని కడప నగరపాలక సంస్థ కమిషనర్ జి.సూర్యసాయి ప్రవీణ్ చంద్ అన్నారు. స్థానిక బాలాజీనగర్ రోడ్డు నెంబరు 13లో యూత్ హాస్టల్ నందు మహాత్మ గాంధీ యూత్ స్టడీ హాల్‌ను ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ యువతీ యువకులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో నెహ్రూ యువ కేంద్ర జిల్లా యువ అధికారి, యూత్ హాస్టల్ మేనేజర్ మణికంఠ, కాంట్రాక్టర్ శ్రీనివాసులరెడ్డి, యువతీ యువకులు పాల్గొన్నారు.

# తెదేపాతోనే భవిష్యత్తుకు గ్యారెంటీ

## – భవిష్యత్తుకు గ్యారెంటీ బస్సు యాత్రలో దేశం నేతలు



**కడప వైద్యవిభాగం, జులై 19, ప్రభాతవార్త:**

రాష్ట్రం బాగుపడాలంటే, అభివృద్ధి చెందాలంటే చంద్రబాబును ముఖ్యమంత్రిని చేసుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉందని టీడీపీ నాయకులు అన్నారు. జిల్లా పర్యటనలో భాగంగా భవిష్యత్తుకు గ్యారెంటీ బస్సు యాత్ర బుధవారం సాయంత్రం కడప నగరం ఆలంఖాన్‌పల్లెకు చేరుకుంది. అక్కడ తెదేపా నాయకులు స్వాగతం పలికి టీడీపీ సీనియర్ నాయకులు ఆలంఖాన్‌పల్లె లక్ష్మిరెడ్డి స్థానిక 49వ డివిజన్ కార్పొరేటర్ ఉమాదేవి ఆధ్వర్యంలో భవిష్యత్తుకు గ్యారెంటీ బస్సు యాత్రసభను నిర్వహించారు. ఈ కార్యక్రమానికి జిల్లా అధ్యక్షులు లింగారెడ్డి, నియోజకవర్గ ఇన్‌ఛార్జి అమీర్‌బాబు, సీనియర్ నాయకులు వరదరాజు రెడ్డి, సీఎం సురేష్‌నాయుడు, హరిప్రసాద్, గోవర్ధన్‌రెడ్డి, రాష్ట్ర ఉపాధ్యక్షులు పార్థసారధిరెడ్డి, జిల్లా ప్రధాన కార్యదర్శి వికాస్ , నగర అధ్యక్షుడు శివకొండారెడ్డిలు మాట్లాడుతూ చంద్రబాబునాయుడు సీఎం అయితేనే రాష్ట్ర సుభిక్షంగా ఉంటుందని, అభివృద్ధి చెందుతుందని తెలిపారు. సైకో జగన్ అధికారంలో రాకముందు ఓ మాట అధికారంలోకి వచ్చాక మాట మార్చి మరో మాట చెబుతున్నారన్నారు. ప్రజలు మరోసారి మోసపోకుండా జగన్‌ను ఇంటికి పంపించాలని ముఖ్యమంత్రిగా చంద్రబాబునాయుడును ఎన్నుకోవాలని తెలిపారు. బస్సు యాత్ర నగరంలోని ప్రధాన కూడళ్ల నుంచి కార్యకర్తలు, ప్రజలు వెంటరాగా వైభవంగా యాత్ర జరిగింది. ఈ కార్యక్రమంలో తెదేపా నాయకులు, కార్యకర్తలు, అధిక సంఖ్యలో ప్రజలు పాల్గొన్నారు.

# జగనన్న సురక్ష ఒక అత్యాధునిక చరిత్ర

## ఎమ్మెల్యే కొరముట్ల శ్రీనివాసులు

**రైల్వేకోడూరు రూరల్, జులై 19 ప్రభాతవార్త 1**

జగనన్న సురక్ష అనే అద్భుతమైన కార్యక్రమమని రైల్వేకోడూరు ఎమ్మెల్యే కొరముట్ల శ్రీనివాసులు అన్నారు. పట్టణంలోని సచివాలయం-3, 2 ఆధ్వర్యంలో జగనన్న సురక్ష కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జగనన్న సురక్ష అనే ఒక అద్భుతమైన కార్యక్రమమని రాష్ట్రంలోని బడుగు బలహీనవర్గాల అభ్యున్నతికి నిరంతరం శ్రమిస్తున్న వైసిపి నాయకులని ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి రాష్ట్రంలో సంచలనాలకు మారుపేరుగా జగనన్న సురక్ష కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నారని, తద్వారా బడుగు బలహీన వర్గాల ఆశయ రథసారధులు ఉన్నారని, కల్లిబొల్లి మాటలు చెప్పే నాయకులను నమ్మవద్దని అన్నారు. ముఖ్యంగా రాష్ట్ర అభ్యుదయ సారథులు జగనన్న సురక్ష కార్యక్రమాన్ని విజయవంతంగా నిర్వహిస్తున్నారని అన్నారు. ఈ కార్యక్రమంలో అన్నమయ్య జిల్లా వ్యవసాయ సలహామండలి చైర్మన్ పంజం సుకుమార్‌రెడ్డి, వైస్ ఎంపిపి రామిరెడ్డి ధ్వజారెడ్డి, ఉపసర్పంచ్ తోట శివసాయి, మండలాలకు చెందిన రథసారధులు పాల్గొంటున్నారని రాష్ట్ర అభ్యుదయ రథసారధి అని, పలురకాల అభ్యుదయ భావాలు కలిగిన రాష్ట్ర నాయకులు పేర్కొన్నారు. అదేవిధంగా ఈ కార్యక్రమానికి కొంతమంది అతిరథ మహారథులు పాల్గొని ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రవేశపెడుతున్న సంక్షేమ పథకాలను అనుభవించేలా ఈ కార్యక్రమాన్ని ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి ఏర్పాటు చేశారన్నారు.కార్యక్రమంలో బుడిగి శివయ్య, సుధాకర్‌రాజు, మందల నాగేంద్ర, మండలాలకు చెందిన పలువురు వైసిపి ముఖ్య నాయకులు పాల్గొన్నారు.

# వృద్ధులకు చేయూత సంతోషకరం

## – అడ్వకేట్ పత్తి నాగేంద్ర ప్రసాద్

**బద్వేలు అర్బన్, జూలై 19 ప్రభాతవార్త :**



పట్టణంలోని తెలుగు గంగ కాలనీలో ఉండే ఆనంద నిలయం నిరాశ్రయుల వసతిగృహం, సుమిత్రా నగర్‌లోని షాలోమ్ అనాధాశ్రమంలో ఉండే తల్లీ, తండ్రి లేని అనాధ పిల్లలకు అనేక దఫాలుగా తుమ్మలపెంట సురేష్ బాబు, కె.వి.సుబ్బారావు వారి వంతు సహాయ సహకారాలు అందజేయడం సంతోషకరమని అడ్వకేట్ పత్తి నాగేంద్ర ప్రసాద్, మార్కెట్ యార్డు డైరెక్టర్ పబ్బతి చంద్రశేఖర్, కౌన్సిలర్ చెవుల వెంకటేశ్వర్లు, యంసి ఫర్నీచర్ మదళ్ళపల్లె సునీల్ కుమార్, కొండపల్లి సుభాష్ కుమార్, వి.వి.రమణ అన్నారు. ఆర్యవైశ్య వర్తక సంఘం అధ్యక్షులు కె.వి.సుబ్బారావు, తుమ్మలపెంట సురేష్ బాబు జన్మదిన సందర్భంగా పలువురు మిత్రుల మధ్య ప్రత్యేక కేక్ కట్ చేశారు. అనంతరం ఇరువురి సేవలను కొనియాడుతూ శాలువాతో ఇరువురిని సత్కరించారు. అనంతరం వారు మాట్లాడుతూ దాన, ధర్మాలకు ప్రతీకగా తుమ్మలపెంట సురేష్ బాబు ఆసరా కోల్పోయిన అనాధలకు, వృద్ధులకు, అభాగ్యులకు ఎన్నో రకాలుగా సేవలందించారని, అలాగే ఆర్యవైశ్యులకు ఏ సమయంలో సమస్యలు వచ్చినా వారి సమస్యలను పరిష్కరించే విధంగా కె.వి.సుబ్బారావు కృషి చేయడం ఎంతో సంతోషకరం అన్నారు. వారు ఇటువంటి పుట్టిన రోజులు మరెన్నో జరుపుకుంటూ ఆసరా కోల్పోయిన పలువురికి చేయూతనిచ్చే లక్ష్యంతో కృషి చేయాలని, భగవంతుడు వారికి ఆయురారోగ్యాలు కల్పించాలని కోరారు.

# స్టాండింగ్ కమిటీ సమావేశంలో మేయర్, కమిషనర్



**కడప కార్పొరేషన్, జులై 19, ప్రభాతవార్త:**

కడప నగరపాలక సంస్థలో స్టాండింగ్ కమిటీ సమావేశంలో జరిగింది. కడప నగర మేయర్ కె.సురేష్‌బాబు, కమిషనర్ సూర్యసాయి ప్రవీణ్‌చంద్ హాజరయ్యారు. పలు అంశాలపై చర్చించారు. ఈ సమావేశంలో స్టాండింగ్ కమిటీ సభ్యులు సుబ్బారెడ్డి, శిరీష, మేసా ప్రమీలా రాణి, షఫీ, హేమలత, డిప్యూటీ కమిషనర్ రమణారెడ్డి, డీసీపీ సంజయ్‌కుమార్, ఆర్‌ఓలు కన్నయ్య, విజయ భాస్కర్‌గౌడ్, ఈఈలు కరీముల్లా, నారాయణ, డీఈలు రాజేష్, వేణుగోపాల్, అబిద్ హుసేన్, ఏటీవో అంజలీ కుమార్, మేయర్ సీసీ విశ్వనాథ్‌రెడ్డి, సీనియర్ అసిస్టెంట్లు శివకుమార్ పాల్గొన్నారు.

# సామాజిక మాధ్యమాల్లో తప్పుడు పోస్టులు పెడితే చట్టప్రకారం చర్యలు

## డిఎస్‌పి విఎన్‌కె చైతన్య



**రాజంపేట అర్బన్, జులై 19 ప్రభాతవార్త**

సామాజిక మాధ్యమాల్లో ఇష్టమొచ్చినట్లు పోస్టింగ్‌లు పెడితే చట్ట ప్రకారం చర్యలు తీసుకుంటామని డిఎస్‌పి విఎన్‌కె చైతన్య హెచ్చరించారు. అసత్య ప్రచారం, రాజకీయంగా ఇబ్బందులు పెట్టేలా పోస్టింగ్‌లు, పరువు ప్రతిష్టలకు భంగం వాటిల్లేలా చేయడం లాంటి పోస్టింగ్‌లు పెట్టకూడదని స్పష్టం చేశారు. అసత్య ప్రచారాన్ని పోస్టింగ్‌లు పెట్టినా గ్రూపు అడ్మిన్‌లు వెంటనే స్పందించి సంబంధిత పోస్టులు వెంటనే డిలీట్ చేయాలని కోరారు. లేనట్లయితే అడ్మిన్ కూడా బాధ్యత వహించాల్సి ఉంటుందని గుర్తు చేశారు. సున్నితమైన విషయాల్లో మరింతగా జాగ్రత్తలు ఉండాలని కోరారు. యాసిడ్ విక్రయించే విషయంలో జాగ్రత్తలు తీసుకోవాలని వ్యాపారులను డిఎస్‌పి కోరారు. ఈ సమావేశంలో అర్బన్ సిఐ నరసింహారావు, ఎస్ఐ లక్ష్మీప్రసాద్‌రెడ్డిలు పాల్గొన్నారు.

# యాసిడ్ అమ్మకాలపై జాగ్రత్తలు వహించండి



**పీలేరు, జూలై 19 ప్రభాతవార్తః**

యాసిడ్ దాడులు నేపథ్యంలో వీటి అమ్మకాలపై అప్రమత్తంగా ఉండాలని పీలేరు పట్టణ సీఐ మోహన్‌రెడ్డి అన్నారు. బుధవారం పీలేరు, కలకడ, సర్కిల్ పరిధిలోని యాసిడ్ వ్యాపారులు విని యోగదారులకు అవగాహన సదస్సు నిర్వహించారు. యాసిడ్ ఏ అవసరం వచ్చి కొనుగోలు చేస్తున్నారో వ్యాపారులు గుర్తించాలని ఆయన సూచించారు. అను మానాస్పద వ్యక్తులు వచ్చి యాసిడ్‌ను కొనుగోలు చేస్తే వెంటనే తమకు సమాచారం ఇవ్వాలని సీఐ సూచించారు. శాంతి భద్రతలకు విఘాతం కలిగించే వారిపై ఉపేక్షించబోమని ఆయన స్పష్టం చేశారు. సమావేశంలో కలకడ ఎస్సై తిప్పేస్వామి, సిబ్బంది, వ్యాపారులు పాల్గొన్నారు.

# ఉత్తమ క్రమశిక్షణ ఎన్‌సిసితో సాధ్యం

## ఎన్‌సిసి విద్యార్థుల ఎంపికలో హెచ్‌ఎం పురుషోత్తమరెడ్డి



**చిట్వేలి, జులై 19 ప్రభాతవార్త**

విద్యార్థులకు విద్యతో పాటు ఎన్‌సిసి చేరికతో ఉత్తమ, మెరుగైన జీవిత అలవాట్లు తదితర సుగుణాలు అలవాడుతాయని చిట్వేలి ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయులు పురుషోత్తంరెడ్డి అన్నారు. 30 ఆంధ్ర బెటాలియన్ ఎన్‌సిసి కడప కమాండింగ్ ఆఫీసర్ లెఫ్టినెంట్ కల్నల్‌రాజ్‌కుమార్ తాప ఆదేశాల మేరకు ఎనిమిదో తరగతి విద్యార్థులను ఎన్‌సిసి అధికారి పసుపుల రాజశేఖర్ ఆధ్వర్యంలో ప్రవేశానికి ఎంపిక చేశారు. సమాజసేవ, దేశభక్తి వంటి లక్షణాలు ఎన్‌సిసితో పెంపొందుతాయని అధికారి రాజశేఖర్ విద్యార్థులకు సూచించారు. నాయక్ సుబేదార్ రాజేంద్రచౌదరి, హవల్దార్ కొండారెడ్డిలు పరుగు పందెం, శారీరక దృఢత్వ పరీక్షలు నిర్వహించి ఎంపిక చేసినట్లు తెలిపారు. 2023 సంవత్సరానికి సంబంధించిన ఎంపికలో బాలుర విభాగం నుండి 17 మందిని ఎంపిక చేసి, 11 మందిని రిజర్వులో ఉంచినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎన్‌సిసి విద్యార్థులు పాల్గొన్నారు.

# భారత జాతీయ అభివృద్ధి సమ్మిళిత కూటమి ఏర్పాటు శుభపరిణామం

**పోరుమామిళ్ళ రూరల్, జులై 19ప్రభాతవార్త:**



దేశంలో అరాచక పాలన సాగిస్తున్న ఎన్డీయే కూటమికి వ్యతిరేకంగా 26 ప్రతిపక్ష పార్టీలు కలిసి ఏర్పాటు చేసిన భారత జాతీయ అభివృద్ధి సమ్మిళిత కూటమి భారతదేశానికి, దేవ అభివృద్ధికి శుభపరిణామమని కాంగ్రెస్ రాష్ట్ర ప్రతినిధి అన్వర్ పేర్కొన్నారు. దేశంలో గత తొమ్మిది సంవత్సరాల నుంచి ఎన్డీయే ప్రభుత్వంతో విసిగి వేసారి పోయిన సామన్య ప్రజలు, రైతులు, అన్ని వర్గాల వారు ఈ ప్రభుత్వం వల్ల ఇబ్బందుల పాలయ్యారని, పెట్రోల్, డీజల్, వంట గ్యాస్ తదితర నిత్యవసర ధరలు అన్నింటిని పెంచి కేవలం వారి మిత్రులైన ఆదాని, అంబానీలకు భారతదేశ సంపదను కట్టబెట్టారన్నారు. భారత జాతీయ అభివృద్ధి సమ్మిళిత కూటమి (ఇండియా) ద్వారా రాబోయే రోజుల్లో దేశం ముందడుగు వేస్తుందని, ఎన్డీయే పాలనలో భారతదేశం 50 సంవత్సరాలు వెనక్కి వెళ్లిందని ఆయన వేదన వ్యక్తం చేశారు. రాబోయే సార్వత్రిక ఎన్నికలలో ఆంధ్రప్రదేశ్ ప్రజలు కూడా ఆలోచించి ఇండియా కూటమికి పట్టం కట్టాలని ఆయన కోరారు. ఈ విలేకరుల సమావేశంలో కాంగ్రెస్ నాయకులు బుడిగి శ్రీను, మహబూబ్ బాషా, యువజన కాంగ్రెస్ నాయకులు సలీం, ముజాహిద్ తదితరులు పాల్గొన్నారు.

# ఇండియా విజయం తథ్యం.. ఎన్డీఏ ఓటమి తప్పదు

**వేంపల్లె, జూలై 19, ప్రభాతవార్త ః**



రాబోయే లోక్‌సభ సార్వత్రిక ఎన్నికల్లో ఇండియా కూటమి విజయం తథ్యమని, ఎన్డీఏ కూటమి ఓటమి పాలవడం తప్పదని మాజీ రాజ్యసభ సభ్యులు, 20సూత్రాల అమలు కమిటి మాజీ చైర్మన్ డాక్టర్ ఎన్.తులసిరెడ్డి ధీమా వ్యక్తం చేశారు. ఈనెల 17, 18 తేదీల్లో బెంగళూరులో జరిగిన ఇండియా కూటమి పార్టీల సమావేశం ఉత్సాహభరితంగా సాగడం హర్షణీయమని తులసిరెడ్డి అన్నారు. ఇండియా కూటమిలో పార్టీలన్నీ బలమైన పార్టీలని, ఎన్డీఏ కూటమిలో బీజేపీ తప్ప బలమైన పార్టీలు లేవన్నారు. బీజేపీ అధికారంలోకి వచ్చి 10ఏళ్లు అయిందని, రైతులు పంట మార్పిడి చేసినట్లు ఓటర్లు కూడా ప్రభుత్వ మార్పిడికి సిద్దంగా ఉన్నారని చెప్పారు. రాబోయే ఎన్నికల్లో కేంద్రంలో ఇండియా కూటమి విజయం తథ్యమని తులసిరెడ్డి అన్నారు. రాష్ట్రానికి బీజేపీ ప్రత్యేకహోదా ఇవ్వకుండా విభజన చట్టంలోని అంశాలు అమలు చేయకుండా తీరని ద్రోహం చేసిందని మండిపడ్డారు. అటువంటి బీజేపీతో జనసేన పార్టీ జతకట్టడం శోచనీయం అన్నారు. అలాగే జగనన్న సురక్ష, జగనన్న తోడుపై ఆయన విమర్శలు గుప్పించారు.

# తాళ్లప్రొద్దుటూరు ఎస్సైగా మోహన్

**కొండాపురం, జూలై 19, ప్రభాతవార్త ః**



కొండాపురం మండలంలోని తాళ్లప్రొద్దుటూరు ఎస్సైగా మోహన్ బుధవారం బాధ్యతలు చేపట్టారు. కడప స్పెషల్ బ్రాంచిలో పనిచేస్తున్న ఈయన బదిలీపై ఇక్కడికి వచ్చారు. శాంతి భద్రతల పరిరక్షణకు తన వంతు కృషి చేస్తానని ఆయన తెలిపారు. అసాంఘిక కార్యకలాపాలపై పోలీసులకు సమాచారం ఇచ్చి ప్రజలు సహకరించాలని ఆయన కోరారు.

# ఎర్రబల్లెలో జగనన్న సురక్ష



**దువ్వూరు, జులై 19, ప్రభాతవార్త:**

మండలంలోని ఎర్రబల్లె లో బుధవారం జగనన్న సు రక్ష కార్యక్రమాన్ని నిర్వహిం చారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ రమాకుమారి మాట్లాడుతూ మండలంలోని 15 గ్రామ సచివాలయాల్లో జగనన్న సురక్ష పథకం సమావేశాలు పూర్తయ్యాయన్నారు. ఈ పథకం ద్వారా 11 రకాల సర్టిఫికెట్లు, వివిధ సమస్యలు వచ్చాయని వాటిని ఆయా శాఖల అధికారులు పరిశీలించి పరిష్కరిస్తారని తెలిపారు. జగనన్న సురక్షలో భాగంగా ప్రజలు దరఖాస్తు చేసుకున్న ధ్రువీకరణ పత్రాలు అందేశారు. ఈ కార్యక్రమంలో ఏవో నాగేంద్రబాబు, వెంకట సుబ్బారెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

# ప్రైవేట్ విద్యాసంస్థలు అవలంభిస్తున్న తీరుపై చర్యలు తీసుకోవాలి

**బద్వేలు, జూలై 19 ప్రభాతవార్త :**



ప్రైవేట్ పాఠశాలలు, కళాశాలలు ప్రభుత్వం నిర్దేశించిన నిబంధనల ప్రకారం యాజమాన్యాలు వ్యవహరించడం లేదని చైల్డ్ రైట్స్ ప్రొటెక్షన్ ఫోరం జిల్లా కో కన్వీనర్ గంటా వెంకటయ్య యాదవ్ అన్నారు. ప్రభుత్వం నిర్దేశించిన సిలబస్, పాఠ్యాంశాలు, పీరియడ్లు, టైం టేబుల్‌కు సంబంధించి కాకుండా యాజమాన్యాలు వారి ఇష్టానుసారంగా నిర్వహిస్తున్నాయని, దీని వలన విద్యార్థులు మానసిక ఒత్తిడికి గురవుతున్నారన్నారు. అదే విధంగా ఉపాధ్యాయులు కూడా ఒత్తిడికి గురవుతున్నారని, 10 నుండి 12 గంటల వరకు విద్యా బోధనలు చేయాల్సిన పరిస్థితి ఏర్పడిందన్నారు. విద్యార్థులకు ఒత్తిడి చేస్తూ ఇష్టానుసారంగా వారిపై భారం మోపుతూ ఆవేదనకు గురి చేస్తున్నారన్నారు.ఆడుతూ పాడుతూ చదుకోవాల్సిన విద్యార్థులు ఆటలకు దూరమై చదువును భయంకరమైన ఒత్తిడికి గురి చేస్తున్నారని, దీని వలన ఆత్మహత్యలకు సైతం పాల్పడుతున్నారని, నిబంధనల ప్రకారం నిర్వహించే విధంగా విద్యాశాఖ అధికారులు చర్యలు తీసుకోవాలని కోరారు.